


CMC- Special Task Force..

-4లో

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# యాక్టివ్ మోడ్‌లో 'ముడుపులు'..!
# స్లీప్ మోడ్‌లో 'ఎస్‌టిఎఫ్'..!

- అక్రమ కట్టడాలకు 'గ్రీన్ సిగ్నల్' ఎవరి అండ దండలతో..?
- దుండిగల్ టౌన్‌ప్లానింగ్‌లో 'చూసీ చూడనట్టు' వ్యవహారిస్తున్న వైనం..!
- మూడేళ్ల క్రితం ఆగిన భారీ షెడ్డుకు మళ్లీ పనులు ఎలా మొదలయ్యాయి..?
- పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా షెడ్డు ఎలా పూర్తయింది..?
- ఆ రూ.2.5 లక్షల ముడుపులు ఎవరికి ముట్టాయి..? ఆరోపణలా..? నిజమేనా..?
- డిప్యూటీ కమిషనర్, ఏసిపి-టిపిఎస్'ల దృష్టికి తీసుకెళ్ళినా చర్యల్లేవంటే అర్థం..?
- రెండు రెసిడెన్షియల్ పర్మిషన్లు.. నిర్మాణం మాత్రం ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్..!
- నిరంజన్ కాలనీలో జనార్ధన్ రెడ్డి, లావణ్యల కాంప్లెక్స్‌కు ముడుపులెన్ని..?
- ఫిర్యాదులు, వార్తా కథనాలతోనూ చర్యలు శూన్యం.. సిఎంసి కమిషనర్ మౌనం..
- 'ఎస్‌టిఎఫ్' చర్యలు చేపట్టడంలో అధికారుల మౌనంపై అనుమానాలు..

- అక్రమ నిర్మాణాలైనా..! అనుమతుల్లేని భారీ షెడ్లు అయినా..! చర్యలు శూన్యం..!
- ముడుపులే లక్ష్యంగా విధుల నిర్వహణ..? కార్యాలయాలంటే కరప్షన్ సెంటర్‌లా..?
- నిర్మాణ చట్టాలు అమలు చేసినోళ్ళే.. వాటిని నిద్రపుచ్చుతున్నారా..?
- ఓ నాయకుడు 'నామినేటెడ్ పదవి'తో..! అక్రమ నిర్మాణాల సెటిల్మెంట్‌లు..?
- కూల్చేసిన అక్రమ కట్టడాల విషయంలో ఆ ముగ్గురు అధికారులకి సెటిల్మెంట్‌లట..?
- అందుకే టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు..!
- టిజి-బిపాస్ చట్టాలైనా..! చర్యల కోసం ఏర్పాటు చేసిన 'ఎస్‌టిఎఫ్' టీమ్ అయినా..!
- నిబంధనలకు తిలోదకాలు పలికి, వసూళ్ళే లక్ష్యంగా అక్రమ నిర్మాణాల దందా..?
- దూడను పాలుతాగమని.. గేదను తన్నమనే సామెతను తలపిస్తున వైనం..

- దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు..?
- జోనల్ కమిషనర్-సిఎంసి కమిషనర్ మౌనానికి సంకేతం..?
- 'ఎస్‌టిఎఫ్' టీమ్ ఏర్పాటు ఉద్దేశం ఏమిటో చెబుతారా 'సిఎంసి కమిషనర్'..?

మొన్న..



మూడు రోజుల క్రితం అక్రమ షెడ్డు ఇలా..

నిన్న..



అధికారుల సౌజన్యంతో నిన్న ఇలా..


సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దుండిగల్ సర్కిల్--59 పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు అనుమతులు లేకుండానే అధికారులను మేనేజ్ చేస్తూ భారీ అక్రమ షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా.. చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. కార్యాలయం దగ్గరలోనే అక్రమ షెడ్డుకు లక్షల్లో ముట్టినట్టు, బిల్డర్ బుక్కుపట్టకుని తిరుగుతున్నాడని, స్థానికంగా కోడై కూస్తోంది.. మరోవైపు రెసిడెన్షియల్ భవనాలకు మంజూరైన వేర్వేరు అనుమతులను ఆధారంగా చేసుకుని, ఒకటే భారీ కమర్షియల్ నిర్మాణాలు.. అక్రమ సెల్లార్‌లతో చేపడుతున్న కట్టడాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రత్యక్షంగానే సహకారం అంటూ ఆరోపణలు నేపథ్యంలో, సిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ మౌనం, అనుమానించక తప్పడంలేదు.. వీటిపై ఫిర్యాదులు, పత్రికల్లో వరుస కథనాలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు దున్నపోతు మీద వర్షం పడిన చందంగా, స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది.. అక్రమ నిర్మాణాల నియంత్రణకు, సిఎంసి కమిషనర్ ఉన్నతాధికారులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఏర్పాటు చేసినప్పటికీ, దుండిగల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.. సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 20:

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రూ.30 వేలు లంచం తీసుకుంటూ..
# ఏసీబీకి పట్టుబడిన 'ఎస్ఐ'..

- స్టేషన్ బెయిల్‌తోపాటు చార్జిషీట్‌లో అనుకూలంగా వ్యవహారిస్తానంటూ హామీ.
- ఇంటి వద్దే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు..

కామారెడ్డి జిల్లా, పెన్ పవర్ ఆగస్టు 20: పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇప్పించడంతోపాటు, కేసులో చార్జిషీట్ దాఖలు చేసే సమయంలో అనుకూలంగా వ్యవహరిస్తానంటూ రూ.30 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు.. కామారెడ్డి జిల్లా రాజంపేట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దువ్వల అంజనేయులు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు.. ఏసీబీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. ఓ కేసులో ఫిర్యాదుదారుడి కుమారుడికి స్టేషన్ బెయిల్ ఇప్పించడం తోపాటు, కేసుకు సంబంధించిన చార్జిషీట్ దాఖలు విషయంలోనూ, అనుకూలంగా వ్యవహరించేందుకు ఎస్ఐ అంజనేయులు రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు అనీశా తెలిపింది.. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా, అధికారులు పక్కా ప్రణాళికతో నిఘా ఏర్పాటు చేశారు.. ఈ క్రమంలో గురువారం (ఆగస్టు 20) ఎస్సై తన నివాసంలో ఉండగా లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సై వద్ద నుంచి రూ.30 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.. ప్రభుత్వ అధికారి తన అధికారిక విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉండగా.. లంచం తీసుకుని అవినీతి నిరోధక శాఖకు దొరికి పోయాడు.. లంచం స్వీకరిస్తూ పట్టుబడిన ఎస్సై అంజనేయులను అరెస్టు చేసి, హైదరాబాద్ నాంపల్లిలోని 'ఎస్‌పిఈ అండ్ ఏసీబీ' కేసుల విచారణకు సంబంధించిన శ్రీశ్రీ అదనపు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు..


Press Note
SUB-INSPECTOR ... KAMAREDDY
... Inspector ... red-handed ... from the ... the comp... charge ...
The ... of AO at ... and thereby performed his public duties dishonestly and improperly. The identity of the complainant has been withheld for security reasons.
Therefore, the AO is being arrested and produced before the Hon'ble II Additional Special Judge for Trial of SPE & ACB Cases, Court at Nampally, Hyderabad. The case is under investigation.
CALL PHONE NUMBER 1064 (TOLL FREE NUMBER)
In case of demand of bribe by any Public Servant, the public are requested to contact Toll Free Number of ACB i.e., 1064 for taking action as per Law. ACB Telangana can also be contacted through social media platforms whatsapp (9440446106), facebook (Telangana ACB), X/formerly twitter (@Telangana ACB). The QR Code of ACB is displayed in all Government Offices and prominent public places to contact ACB, Telangana. The name and details of the victim/complainant will be kept secret.
P.R.O,
Anti-Corruption Bureau,
TG, Hyderabad.

ఏసీబీ అధికారుల ప్రెస్‌నోట్..

### లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండి..

ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అలాగే ఏసీబీ అధికారిక వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేరు, వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ అధికాతులు స్పష్టం చేశారు..




ఏసీబీకి పట్టుబడిన ఎస్ఐ అంజనేయులు..



## పంటలు వేసేటప్పుడు రైతులు ఆలోచన చేయాలి

హైదరాబాద్ పెన్ పవర్: 'నాగార్జునసాగర్‌లో నీరు లేదు. 31 శాతం వర్షం లోటు ఉంది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లోనూ అంతంత మాత్రంగానే వర్షాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రైతులు పంటలు వేసేటప్పుడు ఆలోచన చేయాలి' అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, హుజూర్‌నగర్, చింతలపాలెం, నేరేడుచర్ల, పాలకవీడులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఎంబీసీ ఎత్తిపోతల పథకం నిర్మిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. 'ప్రస్తుతం ఉన్న నీటితోనే పంటలను కాపాడుకోవాలి. మంచి నీటి అవసరాలకు ఉపయోగించుకోవాలి. ఈ పరిస్థితుల్లో నీటిని జాగ్రత్తగా పొదుపుగా వాడుకోవాలి' అని పేర్కొన్నారు.

# యాక్టివ్ మోడ్‌లో 'ముడుపులు'..! స్లీప్ మోడ్‌లో 'ఎస్‌టిఎఫ్'..!





తాజా టిఫిన్స్ పక్కన ఏసిపి శ్రీనివాస్ కూల్చేసిన అక్రమ నిర్మాణం.. పూర్తయింది..



నిరంజన్ కాలనీలో జనార్ధన్ రెడ్డి, లావణ్యల అక్రమ కమర్షియల్ కాంప్లెక్స్.. 2 పర్మిషన్‌లు..

**దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల దందాలో భాగంగా, వివిధ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల వివరాలు ఇలా.. నర్సాపూర్ హైవేకు తాజా టిఫిన్స్ పక్కన అక్రమ నిర్మాణాన్ని ఏసిపి శ్రీనివాస్ సీజ్ చేసి స్వయంగా కూల్చేసిందే, ఇంతలోనే ఎలా సక్రమం అయింది..? నిర్మాణం ఎలా పూర్తయింది..? టెక్ మహీంద్రా ఎదురుగా పర్మిషన్ 2 అంతస్తులు, నిర్మాణం 5 అంతస్తులు.. డిప్యూటీ కమిషనర్, ఏసిపి సమక్షంలోనే కూల్చారు.. అయినప్పటికీ నిర్మాణం పూర్తిచేసి, రంగులు ఎలా వేశారు.. అధికారుల వాటా ఎంత..? బహుదూర్ పల్లిలో సిద్దార్థ గుప్తకు చెందిన అక్రమ కట్టడానికి నోటీసులు ఇచ్చారు.. 1500 గజాల అక్రమ షెడ్డును కూల్చివేశారు.. అయినప్పటికీ, కూల్చినవి రెండు పూర్తిచేసినా చర్యలేవి..? ఇంత బహిరంగంగా బరితెగించి అవినీతికి పాల్పడుతుంటే సిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ మౌనానికి అర్థం..? ఎలా భావించాలి..? వాటాలు వెళ్తున్నాయా..? సిఫార్సులతో సరిపెడుతున్నారా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..**


టెక్ మహీంద్రా ఎదురుగా డీసి, ఏసిపి, టిపిఎస్ సమక్షంలో కూల్చినా.. ఎలా పూర్తయింది..

బహుదూర్‌పల్లిలో నోటీసులు ఇచ్చిన సిద్దార్థ అక్రమ నిర్మాణం ఎలా పూర్తయింది..



- 3 పేజి తరువాయి

మూడేళ్ల క్రితం పనులు ఆగిపోయిన అక్రమ షెడ్డుకు.. సిఎంసిలో విలీనంతో మళ్లీ పనులు చేపట్టడానికి సహకరించిన అవినీతి అధికారి ఎవరు..? చకచకా షెడ్డు నిర్మాణం పూర్తి చేయడానికి 'గ్రీన్ సిగ్నల్' ఎవరిచ్చారు..? సుమారు 1500 గజాల భారీ షెడ్డుకు పర్మిషన్ లేకపోయినా పనులు సాగటంలో అర్థ..? లోపల పనులు మినహాయించి ఏకంగా బయట అక్రమ షెడ్డు పూర్తి కావడానికి కీలకపాత్ర పోషించిన టౌన్‌ప్లానింగ్ అధికారులెవరు..? అన్న ప్రశ్నలకు సిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ సమాధానం రాబట్టాలి.. ఎస్‌టిఎఫ్ టీమ్ ఏర్పాటు, అక్రమ నిర్మాణాల నియంత్రణకా..? వసూళ్ళ దందా బలోపేతానికా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. దుండిగల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో, పెట్రోల్ బంకు వెనుకవైపు నిర్మాణంలో ఉన్న భారీ షెడ్డుపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం ఈ షెడ్ నిర్మాణ పనులు సుమారు మూడేళ్ల క్రితమే ప్రారంభమయ్యాయి.. అప్పటి మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో పనులు నిలిచిపోయినట్లు చెబుతున్నారు.. అనంతరం మరో కమిషనర్ హయాంలోనూ నిర్మాణం ముందుకు సాగలేదని స్థానికులు పేర్కొంటున్నారు.. అయితే ప్రస్తుతం అదే అక్రమ షెడ్డు నిర్మాణ పనులు మళ్లీ ఊపందుకోవడం, గురువారం నాటికి బయటివైపు షెడ్డు దాదాపుగా పూర్తి చేస్తుంటే డిప్యూటీ కమిషనర్, ఏసిపి-టిపిఎస్ ఏమీ తెలియనట్టు వ్యవహరించడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. అప్పట్లో నిర్మాణాన్ని నిలిపివేసిన నిబంధనలు ఇప్పుడు ఏమయ్యాయి..? కొత్తగా ఏమైనా అనుమతులు పొందారా..? లేక అధికారుల వైఖరిలో మార్పు వచ్చిందా..? అనే ప్రశ్నలకు సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది. సర్కిల్-59 కార్యాలయానికి, పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే ఇంత భారీ నిర్మాణం జరుగుతున్నా అధికారుల దృష్టికి రాకపోవడం శోచనీయం..


సిద్దార్థ అక్రమ నిర్మాణం ఈ దశలోనే నోటీసులు..

## 'ఎస్‌టీఎఫ్' ఉన్నా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ..?

అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకునేందుకు 'ప్రత్యేక టాస్క్ ఫోర్స్' (ఎస్‌టిఎఫ్) ఏర్పాటు చేసినప్పటికీ, అదే సిఎంసి పరిధిలో, అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు రావడం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.. సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఏసీపీ--టీపీఎస్ సహా సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు సమన్వయంతోనే సహకరిస్తున్నారని ఈ అక్రమ కట్టడాలు సూచిస్తున్నాయి.. మరోవైపు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్, లకు టౌన్‌ప్లానింగ్ విభాగంపైన, ఎందుకింత నిర్లిప్తతో తెలియదు కానీ.. అక్రమ కట్టడాల దందాలో రూ. లక్షలు, కోట్లు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఈ ఒక్క అక్రమ షెడ్డుకే రూ.2.5 లక్షలు అంటే వందల్లో నిర్మాణాలకు ఎంత..? అన్న ప్రజల ప్రశ్నలకు సమాధానం ఉందా..?

## రెండు పర్మిషన్లు..నిర్మాణం ఒక్కటే..!

బహదూర్‌పల్లి గ్రామంలోని నిరంజన్ కాలనీలో మరో నిర్మాణం టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అధికారిక వివరాల ప్రకారం లావణ్య పేరుతో ప్లాట్ నంబర్-90కు, జనార్ధన్ రెడ్డి పేరుతో ప్లాట్ నంబర్-91కు వేర్వేరుగా రెసిడెన్షియల్ భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు చెబుతున్నారు. లావణ్య పేరుతో ఫైల్ నంబర్ 013564/DUND/00157/IABP/2025, పర్మిట్ నంబర్ 0094/DUND/IABP/2025 కింద 30-08-2025న 235 గజాల ప్లాట్ నంబర్-90లో స్టిల్ట్ ఫర్ పార్కింగ్ + రెండు అంతస్తుల రెసిడెన్షియల్ భవనానికి అనుమతి మంజూరైనట్లు పేర్కొంటున్నారు..అదే తేదీన జనార్ధన్ రెడ్డి పేరుతో ఫైల్ నంబర్ 013555/DUND/00156/IABP/2025, పర్మిట్ నంబర్ 0095/DUND/IABP/ 2025 కింద 354 గజాల ప్లాట్ నంబర్-91లోనూ స్టిల్ట్ ఫర్ పార్కింగ్ + రెండు అంతస్తుల రెసిడెన్షియ ల్ భవనానికి అనుమతి ఇచ్చినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి.. అయితే వేర్వేరు ప్లాట్లకు, వేర్వేరు పేర్లపై మంజూరైన ఈ రెండు అనుమతులు కలిపి నిర్మాణం మాత్రం, ఒకే భారీ వ్యాపారాత్మక నిర్మాణంగా మారడం అదనంగా సెల్లార్ నిర్మాణంపై డిప్యూటీ కమిషనర్ బెల్లం కొట్టిన రాయిలా మౌనం వహిస్తున్నారు.. అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు..

## సెటిల్మెంట్‌ల వ్యవహారంలో.. నామినేటెడ్ నేత..?

భారీ అక్రమ షెడ్డుతో పాటు, కూల్చేసిన మరికొన్ని అక్రమ కట్టడాలు, ఇతర అక్రమ నిర్మాణాల వ్యవహారంలో, ఓ అధికారపార్టీ నేత, తన నామినేటెడ్ పదవిని అడ్డు పెట్టుకుని, సెటిల్మెంట్‌ల బాధ్యత కూడా చేపట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి.. అటు 'స్వామి కార్యం' ఇటు 'స్వ కార్యం' ఏక కాలంలో సిద్ధిస్తుంటే..! ఏ అధికారులకైనా "డబ్బంటే చేదెవరికి" ఉంటుంది..? చట్టబద్ధత లేని సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తున్న దుండిగల్ సర్కిల్-59 సిఎంసి అధికారులు.. టిజి-బిపాస్ చట్టాన్ని, నిబంధనలను కూడా నిర్వీర్యం చేస్తున్నారు.. సిఎంసి కమిషనర్ ఏర్పాటు చేసిన 'ఎస్‌టిఎఫ్' టీమ్ నియామకాన్ని అబాసుపాలు చేస్తున్నారు.. ఫిర్యాదులు చేసినా..! పత్రికల్లో వచ్చినా..! లంచాలకే ప్రధాన్యత ఇస్తున్నారని ఆరోపణలకు బలం చేకూరుస్తున్నారు.. అందుకు నిదర్శనమే నేటి 'పెన్ పవర్' దినపత్రికలో ప్రచురితమైన అక్రమ నిర్మాణాలను, ఉన్నతాధికారులు పరిశీలిస్తే..! ఆ ముగ్గురు అవినీతి అధికారులకు చెక్ మేట్ తప్పదని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన వెంటనే, పరిశీలన చేసి, అనుమతుల నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు..

## 'సిఫార్సుల' మాటున అక్రమ నిర్మాణాల దందా..?

దుండిగల్ టౌన్‌ప్లానింగ్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యల విషయంలో రాజకీయ సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారపార్టీకి చెందిన కొందరు నాయకుల సిఫార్సుల పేరుతో అక్రమ కట్టడాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం కొనసాగుతోంది.. అయితే ఇవి ఆరోపణలు మాత్రమేనని, కొట్టిపడేయడానికి అవకాశం లేదు.. కళ్ళెదుటే సాక్షాత్కారిస్తున్నాయి.. నిజంగా రాజకీయ సిఫార్సులే అధికారులను ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయా..? లేక ఈ సిఫార్సుల సాకుతో అధికారులే వసూళ్ళ దందా ప్రారంభించారా..? అన్న ప్రశ్నలు కీలకంగా మారాయి.. ఈ అంశంపై సిఎంసి ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది..

బహుదూర్‌పల్లి కూల్చేసిన 1500 గజాల షెడ్డు, ఇలా ఎలా పూర్తయింది..




1500 గజాల షెడ్డు కూల్చేసిన ఫైల్‌ఫొటో..



పోలీస్ స్టేషన్ సమీపంలో.. 2 పర్మిషన్‌లతో ఒకటే కమర్షియల్ నిర్మాణం..

# రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి

## - టి.పి.సి.సి సభ్యులు జె.బి. శౌరి




**కొత్తగూడెం పెన్ పవర్:** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కొత్తగూడెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టి.పి.సి.సి సభ్యులు జె.బి. శౌరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జె.బి. శౌరి మాట్లాడుతూ... దేశాన్ని ఆధునిక, సాంకేతిక భారతదేశంగా తీర్చిదిద్దేందుకు దూరదృష్టితో కృషి చేసిన మహానేత రాజీవ్ గాంధీ అని అన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు కంప్యూటర్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు నేటి భారతదేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు మెరుగైన అవకాశాల కల్పన వంటి అంశాలకు రాజీవ్ గాంధీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు నేటి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. "దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మిన మహానేత రాజీవ్ గాంధీ. ఆయన కలలు కన్న ఆధునిక, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని జె.బి. శౌరి అన్నారు. రాజీవ్ గాంధీ చూపిన అభివృద్ధి, ప్రజాసేవ మార్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టౌన్ కన్వీనర్ ఎం.డి. గౌస్ మోహినుద్దీన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు సురేష్ అజ్మీర, మాజిక్ ఆప్షన్ మెంబర్ ఆరిఫ్ ఖాన్, యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షులు ఉస్మాన్ అలీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్, నిరంజన్, సమ్మయ్య, కోటిరెడ్డి, దేవేందర్‌రావు, ఎం.డి. అక్బర్ తదితరులు పాల్గొన్నారు




## ఐదవ అంతస్తునుంచి పడి కార్మికుడి మృతి

**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:** పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధి పద్మనగర్ ఫేస్ 2 సాయిబాబా ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల అపార్ట్ మెంట్ లో ఐదవ ఫ్లోర్ నుండి కింద పడి కార్మికుడు అక్కడిక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడు జనగామ జిల్లా కొడకండ్ల మండలం రంగాపురం గ్రామం సిలివేరు కుమార్ (35) తండ్రి సోమయ్య గా గుర్తింపు, మృతుడికి భార్య మమత, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గాజులరామరంలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బహుళ అంతస్తుల నిర్మాణంలో భవన సామాగ్రి పైన కి తీసుకెళ్లే మిషన్ ఆపరేటర్ పని చేసుకుంటూ ఉంటాడు. కాగా రోజు వారి పనిలో భాగంగా పద్మనగర్ పేస్ 2 సాయిబాబా ఆలయం సమీపంలో బహుళ అంతస్తుల నిర్మాణంలో కింద నుండి మెటీరియల్ తీసుకెళ్లే క్రేన్ మిషన్ ఆపరేటర్ గా పని చేసుంటున్నాడు. ప్రమాదవశాత్తు మిషన్ బేరింగ్ లు ఊడిపోవడంతో మిషన్ పైన ఉన్న కుమార్ ఐదవ అంతస్తు నుండి ఒక్కసారిగా కింద పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కీసరలో టిఫిన్ సెంటర్లో అగ్ని ప్రమాదం

**హైదరాబాద్ పెన్ పవర్:** కీసర గ్రామంలో టిఫిన్ సెంటర్లో సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయాన్నే టిఫిన్ తయారీ కోసమై సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి అక్కడున్న వారు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. . ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## రాజీవ్ గాంధీ చిత్రపటానికి

## ఘన నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్: పెన్ పవర్:** రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి రాజీవ్ గాంధీని మంత్రి పొన్నం ప్రభాకర్ స్మరించుకున్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూభారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్న.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విశ్వసించిన రాజీవ్ గాంధీ యువతకు ఎన్నో అవకాశాలను కల్పించారు.

కేవలం 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి, దేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో యువతకు కీలకమైన పాత్ర కల్పించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ. భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లాలనే దూరదృష్టితో ఆయన సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. నేడు మనం చూస్తున్న సమాచార సాంకేతిక, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు ఎంతో కీలకమైనవి.

అదేవిధంగా గ్రామీణ భారత అభివృద్ధికి రాజీవ్ గాంధీ గారు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు.

గ్రామ పంచాయతీలకు మరిన్ని అధికారాలు, నిధులు అందించడంతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేశారు. 73వ, 74వ రాజ్యాంగ సవరణలకు ఆయన ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రయత్నాలు స్థానిక సంస్థలకు ప్రజాస్వామ్య బలాన్ని చేకూర్చాయి.

## గ్యాస్ బండపై రూ.40 బాదుడు

## డెలివరీ, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో అదనపు వసూళ్లు...

**హైదరాబాద్ పెన్ పవర్:** పల్లె ప్రజలే టార్గెట్‌గా మారారా? బోనకల్ గ్రామంలోని వత్సవాయి రోడ్డులో ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ వ్యవహారంపై గ్రామీణ వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డెలివరీ, ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరుతో ఒక్కో గ్యాస్ సిలిండర్‌కు రూ.35 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి తమ గ్రామాల వరకు గ్యాస్ వాహనం వస్తుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అదనపు డెలివరీ చార్జీ తీసుకుంటున్నప్పటికీ కనీసం ఇంటి గుమ్మం వరకు సిలిండర్‌ను తీసుకెళ్లి దింపడం లేదని ఆరోపిస్తున్నారు.

**పల్లె ప్రజల అవసరమే ఆసరానా?**

గ్యాస్ సిలిండర్ ప్రతి ఇంటికి తప్పనిసరి నిత్యావసరం కావడంతో.. దాని కోసం వినియోగదారులు తప్పనిసరిగా ఏజెన్సీపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు చార్జీలపై ప్రశ్నిస్తే మేము ప్రజల కోసమే నిచేస్తున్నాం.. కనీసం బండకు రూ.40 ఇవ్వలేరా?" అంటూ ఘాటుగా సమాధానం చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు. దీంతో తమ సమస్యను ప్రశ్నించేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు వాపోతున్నారు.

**బిల్లు లేదు.. బుక్కులో సంతకమే!**

ఇక బిల్లు విషయంలోనూ వినియోగదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ తీసుకున్న తర్వాత సరైన బిల్లు ఇవ్వకుండా బుక్కులో సంతకం మాత్రమే తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. బిల్లు అడిగితే "సంతకమే బిల్లు" అంటూ సమాధానం ఇస్తున్నారని చెబుతున్నారు. దీంతో సిలిండర్ అసలు ధర ఎంత? అదనంగా తీసుకుంటున్న రూ.35--40 ఏ చార్జీకి సంబంధించినది? అనే విషయాల్లో గ్రామీణ వినియోగదారులకు స్పష్టత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

పల్లె ప్రజల నుంచి అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ భారత్ గ్యాస్ ఏజెన్సీపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అదనపు వసూళ్ల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు సరైన బిల్లులు అందేలా చూడాలని కోరుతున్నారు.

"పల్లె ప్రజల జేబులపై భారం వేస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకుంటారా? గ్రామీణ వినియోగదారులకు న్యాయం చేసేది ఎవరు?" అంటూ బోనకల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## జిల్లా ఇంచార్జి మంత్రిని

## మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

**నిజామాబాద్, ఆగస్టు 19 పెన్ పవర్:** నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి డి.అనసూయ సీతక్కను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రితో పాటు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీలకు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

# అటవీ ప్రాంత సంరక్షణ కోసం సమన్వయంతో కృషి చేయాలి

### జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా




**హైదరాబాద్ పెన్ పవర్:**

జిల్లాలో అటవీ ప్రాంత సంరక్షణ కోసం వివిధ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, అటవీ భూముల ఆక్రమణల నిరోధం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు చేపట్టడం, వనమహోత్సవం కింద విరివిగా మొక్కలు నాటడం, జల సంరక్షణ కార్యక్రమాల అమలు, వాల్టా చట్టం అమలు, అనువైన అటవీ ప్రదేశాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం తదితర అంశాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో అటవీ శాఖపరంగా నెలకొని ఉన్న పరిస్థితుల గురించి జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ పాటిల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జిల్లాలో 20 శాతానికి పైగా 86947.11 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందని తెలిపారు. అయితే, సిరికొండ, కమ్మర్పల్లి, కాల్పోల్ తండా, డీ.బీ.తండా, చందూర్ తదితర ప్రాంతాలలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, కబ్జాదారులపై చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల తోడ్పాటు అవసరం ఉందని అన్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ, అటవీ ప్రాంత సంరక్షణకు ఆయా శాఖలు ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కు తప్పకుండా తగిన సహకారం అందించేలా చూస్తామన్నారు. అటవీ భూములను కబ్జా చేస్తే కఠిన చట్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుండి ఆయా గ్రామాలలో విరివిగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అన్ని చర్యలు చేపట్టాలని, చిరుతలు, ఇతర వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్న చోట వాహనాల వేగాన్ని నియంత్రించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. అటవీ సంపద పరిరక్షణ కోసం జిల్లాలో అవసరమైన సరిహద్దు ప్రదేశాలలో చెక్ పోస్టుల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. జల సంరక్షణ, భూగర్భ జల వనరుల పెంపు కోసం అటవీ ప్రాంతాలలో చెక్ డ్యాంలను నాణ్యతతో నిర్మించాలని, వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ఆర్మూర్ నగర వాటిక, నిజామాబాద్ లోని ఖిల్లా, నందిపేట లోని ఎస్సారెస్పి బ్యాక్ వాటర్ ఏరియా, అంకాపూర్ లోని మోడల్ స్కూల్ తదితర చోట్ల అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనలకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, ఏ.సీ.పీలు ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు దారి మళ్లిస్తే కఠిన చర్యలు.

### ఎస్సి, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.



**జయశంకర్ భూపాలపల్లి. పెన్ పవర్:** ఎస్సి, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎస్సి, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, ఆర్ ఓ ఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధులు వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో కమిషన్ ఛైర్మన్, సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మంజూరైన నిధులను ఎస్సి, ఎస్టీ ఆవాసాలకు ఖర్చు చేయకపోతే ఆయా శాఖల అధికారులదే భాద్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల విషయంలో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఛైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కేసుల పురోగతిని సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు సంబంధిత అధికారులను ఆయన అభినందించారు. ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్లు తప్పనిసరిగా పాటించాలిప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్ నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, సంబంధిత అధికారులు నిబంధనలను పూర్తిగా పాటించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులకు భంగం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

**బాధితులకు పరిహారంతో పాటు ఉపాధి, పునరావాసం**

తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్య, అత్యాచారం వంటి ఘటనలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతోనే వదిలేయకుండా వారి పునరావాసంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఛైర్మన్ సూచించారు.

నిబంధనల ప్రకారం అర్హులైన బాధితులకు పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి అవకాశాలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలిప్రతి నెల గ్రామ స్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బంది మాత్రమే హాజరుకాకుండా తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

గ్రామీణ ప్రజలకు ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

**గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**

గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, ఇతర నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందని ఛైర్మన్ పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి పంచాయతీ నిధులు లేదా సీఎస్ఆర్ నిధుల ద్వారా సిసి కెమెరాలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా పెంచడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు నేరాలు జరిగినప్పుడు దర్యాప్తుకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ఎస్సీ, ఎస్టీ ప్రజల పట్ల అధికారులు మానవీయ కోణంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలని అన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, వాటిని నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత శాఖలు సమయపాలనతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.


**సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ**

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఛైర్మన్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హత ఉన్న వారికి పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యతతో పరిష్కరించి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పేర్కొన్నారు.

అధికారుల సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో పథకాల అమలును పర్యవేక్షించాలని సూచించారు. విదేశీ విద్యా, బాధితులకు పరిహారం, కులాంతర వివాహం చెల్లింపులు పెండింగ్ ఉన్నవాటి నివేదిక అందచేయాలని ఎస్సి అభివృద్ధి అధికారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బాధితులకు కమిషన్ సూచించిన విధంగా ఇళ్ళ కేటాయింపుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి నెలా క్రమం తప్పక పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ అత్యాచార తదితర సంఘటనలపై తక్షణమే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కమిషన్ నుండి 6 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో మూడు కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఛైర్మన్ కు సభ్యులకు జ్ఞాపిక అందచేశారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మి నారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఎస్సి అభివృద్ధి అధికారి సుకీర్తి జై భీం, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, కాటారం, భూపాలపల్లి డీఎస్పీలు సూర్య నారాయణ, సంపత్ రావు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడివోలు వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో సమస్యల సెగ



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ దేశి రామ్ నాయక్



సమస్యలపై నిలదీస్తున్న పెద్ద కిస్టాపురం సర్పంచ్ గంగావత్ రామ్ సింగ్

## అధికారుల సమన్వయ లోపంపై సర్పంచుల అసంతృప్తి

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 20:** మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని మండల ప్రత్యేక అధికారి జి. దేశీరామ్ నాయక్ అన్నారుగురువారం గార్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులతో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల పనితీరుపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు.సమావేశంలో వ్యవసాయ శాఖ ఏఓ కావటి రామారావు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ, లాభదాయకమైన పంటలను సాగు చేయాలని సూచించారు. దీనిపై మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గంగావత్ రామ్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు, సహకారం అందించాలని కోరారు. అధికారులు ఉన్నతాధికారులతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాల వివరాలను ప్రజాప్రతినిధులకు అందించాలని అన్నారు.

గ్రామ సభలకు అధికారులు ఎందుకు రావడం లేదు? పెద్ద కిస్టాపురం సర్పంచ్ రామ్ సింగ్ నాయక్

గ్రామ సభలకు వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామ సభలు కీలకమని, అలాంటి సమావేశాలకు అధికారులు గైర్హాజరు కావడం సరికాదని అన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నా అధికారులు స్పందించడం లేదని రామ్‌సింగ్ నాయక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మర్రిగూడెం సర్పంచ్ రామ్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన ఎరువులను రాయితీపై అందించాలని, సోలార్ ఫెన్సింగ్, డ్రిప్ సిస్టమ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపి పరిష్కారం కోసం అధికారులు బాధ్యతగా పనిచేయాలని అన్నారు.చిన్నబంజర సర్పంచ్ మోతీలాల్ మాట్లాడుతూ రైతులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలోనే సేవలు అందించాలని కోరారు.



వైద్యశాఖ విద్యుత్ శాఖ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సర్పంచులు మోతిలాల్ రామ్ సింగ్ వీరన్న వెంకట్రావ్

### వైద్య సేవలపై నిలదీత

వైద్య శాఖ పద్దుపై డాక్టర్ హనుమంతరావు వివరాలు వెల్లడించారు. అనంతరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె. నాగేశ్వరరావు మాట్లాడుతుండగా పలువురు సర్పంచులు ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రికి కేటాయించిన ఐదుగురు వైద్య సిబ్బంది విధుల్లో జవాబుదారీతనంతో వ్యవహరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మహిళలకు గైనకాలజీ సేవలు అందించేందుకు డాక్టర్ మౌనిక అందుబాటులో ఉండాలని కోరారు.మిషన్ భగీరథ ఏఈ చిరంజీవి మాట్లాడుతుండగా పలువురు సర్పంచులు తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ప్రశ్నించారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డబ్ల్యూఎస్ అధికారి అరుణ పలు అంశాలపై వివరాలు వెల్లడించారు.చెరువులు, కుంటల శిఖం భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, చెరువుల్లో ఏర్పాటు చేసిన మోటార్లను తొలగించాలని ప్రజాప్రతినిధులు కోరారు. మహబూబాబాద్, ఇల్లందు డిపోల నుంచి ఆర్టీసీ షటిల్ బస్సులను మండలం మీదుగా నడపాలని, స్థానిక ఇంటర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామపంచాయతీలకు వైఫై సౌకర్యం కల్పించాలని, పాత పీసా కమిటీల స్థానంలో నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని మర్రిగూడెం సర్పంచ్ రామ్‌సింగ్ నాయక్ కోరారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మండల ప్రత్యేక అధికారి జి. దేశీరామ్ నాయక్ హామీ ఇచ్చారు.ఈసమావేశంలో ఎంపీడీవో మంగమ్మ, డీటీ శ్రీరామ్ నాయక్, మండల పరిధిలోని సర్పంచులు, పంచాయతీల కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు హాజరుకాగా విద్యుత్ ఏ ఈ గైర్హాజరయ్యారు

# కాసులు కురిపిస్తున్న బోడె కాకరకాయలు

**అదిలాబాద్, ఆగస్టు 20, పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాలో బోడకాకర ఈ సీజన్‌లో మార్కెట్లో ఎక్కడ చూసినా కనిపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి, ఆదిలాబాద్ రూరల్ , మండలాల్లోని పలు అటవీ ప్రాంతాల్లో ఉట్నూర్ ఏజెన్స్ ప్రాంతంలో, అటూ కవ్వాల్ అభయారణ్యం అటవీ ప్రాంతాల్లో బోడ కాకర కాయలు విరివిగా దొరుకుతాయి. పక్కనున్న మహారాష్ట్ర సరిహద్దులోని మాండ్వి, కిన్వట్, బోరీ, పాండ్రకవడ, ఘాటంజి తదితర ప్రాంతాల్లోను ఎక్కువగా దొరుకుతాయి. ఇక్కడి ప్రాంతవాసులు సైతం ఆదిలాబాద్‌కు తీసుకొచ్చి మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. ఇవి కేవలం అటవీ ప్రాంతంలోనే కాదు దట్టమైన పొదల్లో, చెట్లకు అల్లుకొని ఉన్న తీగల్లోను ఈ బోడ కాకరకాయ పెరుగుతుంది. జూలై నుంచి ఆగస్టు, సెప్టెంబర్ నెల వరకు మాత్రమే ఇవి కాస్తాయి. బోడకాకర కాయలు సహజంగా లభిస్తాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో బోడ కాకరలు ఎక్కువగా దొరుకుతున్నాయి. ఆదిలాబాద్ రైతు బజార్‌తోపాటు రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌లపై అమ్మకాలు చేస్తున్నారు. అమ్మకాలు చేసే వారు ఎక్కువగా అడవుల్లో బుర్క పిట్టలు, ఇతర అడవి ప్రాంతాల వనరులపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ సీజన్‌లో మాత్రం బోడకాకరలను ఎక్కువగా వీరే తీసుకొస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్‌లో బోడకాకర కిలో రూ.200 ధర పలుకుతోంది. ఒక్క రోజు ఒక్కొక్కరు చొప్పున సుమారు వెయ్యి, నుంచి 2వేల వరకు అమ్మకాలు చేసి ఉపాధి పొందుతున్నారు. బోడకాకరను తెంపడం కొంచెం కష్టంగా ఉంటుంది. ఉదయం వేకువ జామున అడవుల్లోకి వెళ్ళి చెట్ల పొదల్లో విష కీటకాల నుంచి తమను తాము రక్షించుకుంటూ ఈ బోడ కాకరలను సేకరిస్తున్నామని రాథోడ్ వివరించారు. జిల్లాలో ఎక్కువగా అడవుల్లో తమ సామాజిక వర్గానికి చెందిన వారు బోడకాకర సేకరిస్తూ మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్ మార్కెట్‌లో రూ.200కేజీ అమ్ముతున్నామన్నారు. వచ్చిన డబ్బులతో తమ కుటుంబం కోసం వివిధ అవసరాల కోసం ఉపయోగిస్తున్నామని, ఈ సీజన్‌లో మాత్రమే సెప్టెంబర్ వరకు దొరుకుతాయని అన్నారు.ప్రస్తుతం శ్రావణమాసం సందర్భంగా ఎక్కువగా అందరు మాంసాహారాన్ని మానేసి బోడ కాకరను తింటున్నారు. వానాకాలంలో చికెన్, మటన్ కంటే ఔషధ గుణాలున్న బోడ కాకరకాయ తింటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం తక్కువ అని డాక్టర్లు సైతం చెబుతుంటారు. చాలామంది శ్రావణమాసంలో మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఈ బోడ కాకరకాయను కొన్ని ప్రాంతాల్లో ఆగాకర, బొంత కాకర, అడవి కాకర, వంటి పేర్లతో కూడా పిలుస్తారు. మరాఠీ, హిందీ భాషల్లో ఇక్కడి ప్రాంత వాసులు కర్టులే, కంటోలా అని పిలుస్తారు. సాధారణ కాకరకాయతో పోలిస్తే చిన్నగా, పైభాగంలో ముళ్లలాంటి పొరతో కనిపించే ఈ కూరగాయకు ఈ సీజన్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. రుచి మాత్రమే కాకుండా ఇందులో పలు రకాల పోషకాలు ఉండటం దీని ప్రత్యేకత. బోడ కాకరకాయలో పీచు, విటమిన్ ఏ, విటమిన్ సీ, విటమిన్ కె, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు లభిస్తాయి. అంతేకాకుండా యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కలిగిన ఫైటోన్యూట్రియెంట్లు కూడా ఉంటాయి. ఇవి శరీరంలో కణాలను దెబ్బతీసే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఈ బోడకాకరలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆహారం సులభంగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలు తగ్గడానికి పీచు సహాయపడుతుంది. తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువును నియంత్రించుకోవాలనుకునేవారు కూడా దీన్ని సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. ఎక్కువ నూనెతో కాకుండా తక్కువ నూనెతో వండితే మరింత ఆరోగ్యకరమైన ఎంపికగా ఉంటుంది. వర్షాకాలంలో లభించే ఈ కూరగాయలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు ఉండటం వల్ల శరీర రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన పోషకాలను అందించడంలో కూడా తోడ్పడుతుంది. చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడే పోషకాలు ఇందులో ఉండటం మరో ప్రయోజనం.బోడ కాకరకాయతో పులుసు, కూర, వేపుడు, పొడి, బిర్యానీ వంటి వంటకాలు చేసుకోవచ్చు. ఆరోగ్య ప్రయోజనాల కోసం ఎక్కువ నూనె, ఉప్పు కలపకుండా వండటం మంచిది. మధుమేహం లేదా బీపీకి మందులు వాడుతున్న వారు ఆహారంలో మార్పులు చేసే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. సరైన ఆహారం, వ్యాయామం, నిద్రతో పాటు ఇలాంటి సీజనల్ కూరగాయలను మితంగా తీసుకోవడం ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడుతుంది.

# నరకప్రాయం...ఈ రహదారి...

**హైదరాబాద్, ఆగస్టు 20, పెన్ పవర్:** విశ్వనగరంగా గ్లోబల్ మ్యాప్‌పై మెరుస్తున్న హైదరాబాద్‌లో ప్రయాణం రోజురోజుకూ సగటు పౌరుడికి ఒక నరకప్రాయ అనుభవంగా మారుతోంది. ఐటీ రంగానికి గుండెకాయ లాంటి గచ్చిబౌలి, మాదాపూర్ కారిడార్ల నుంచి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వరకు ప్రయాణించాలంటే గంటల తరబడి రోడ్లపైనే నరకం చూడాల్సి వస్తోంది. ఇటీవల హెచ్-సిటీ ఫ్లైఓవర్ , అండర్‌పాస్ పనుల నెపంతో కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ పోలీసులు వన్-వే విధానాన్ని అమలులోకి తీసుకురావడం ఈ సమస్యను మరింత జటిలం చేసింది. పైలట్ డ్రైవ్‌లు పూర్తి చేశామని అధికారులు చెప్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ మార్గాల అవగాహన లేక, అశాస్త్రీయమైన డైవర్షన్ల వల్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి.మరోవైపు గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, బీహెచ్ఈఎల్, మియాపూర్ ప్రధాన రహదారులతో పాటు కనెక్టింగ్ రోడ్లు అన్నీ భారీ గోతులతో నిండిపోయాయి. వర్షాలు పడినప్పుడల్లా మోకాటి లోతు నీరు చేరడం, ఆ గుంతల్లో వాహనాలు చిక్కుకుపోవడంతో ఐటీ ఉద్యోగుల రాకపోకలు గంటల కొద్దీ ఆలస్యమవుతున్నాయి. సీఎస్ఆర్, మున్సిపల్ రోడ్డు మరమ్మతుల పేరుతో ప్రచారం జరుగుతున్నా, వాస్తవానికి జిహెచ్ఎంసి , సైబరాబాద్ అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పనుల ప్రక్రియ నెమ్మదిగా సాగడం, మరమ్మతులకు వాడే క్వాలిటీ మెటీరియల్ లోపించడం వల్ల వాన పడగానే వేసిన ప్యాచ్ వర్క్‌లు కొట్టుకుపోయి రోడ్లు మళ్లీ అధ్వానంగా తయారవుతున్నాయి.ఇంతటి తీవ్రమైన సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమర్థవంతంగా హ్యాండిల్ చేయలేకపోవడానికి ప్రధానంగా సమన్వయ లేమి కారణం. ట్రాఫిక్ పోలీస్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మంజీరా డిజైన్ టీమ్‌లు, రహదారుల నిర్మాణ సంస్థల మధ్య ముందస్తు ప్రణాళికలు ఉండటం లేదు. ఒకరు రోడ్డు వేస్తే, మరొకరు కేబుల్స్ లేదా పైప్‌లైన్ల కోసం దాన్ని తవ్వేస్తున్నారు. పైగా మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు వర్క్ స్పేస్ అంచనా వేసి రాత్రి వేళల్లో వేగంగా పనులు పూర్తి చేయాల్సి ఉండగా, పగటిపూట కూడా ఆంక్షలు విధించి సివిల్ వర్క్స్ సాగదీస్తుండటం వల్ల ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కుదేలవుతోంది. రాజకీయంగానూ ఈ అంశం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంటోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓటర్లు, ఐటీ రంగానికి చెందిన ప్రొఫెషనల్స్ ప్రభుత్వం అందించే మౌలిక వసతుల పట్ల అత్యంత సున్నితంగా ఉంటారు. ఒకవైపు పన్నులు చెల్లిస్తూ, మరోవైపు రోడ్లపై గంటల కొద్దీ వేచి చూడాల్సి రావడం వల్ల పరిపాలనా వైఫల్యం అనే ముద్ర బలంగా పడే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలు కూడా ఈ ట్రాఫిక్ కష్టాలను, వర్షాకాలంలో గుంతల రోడ్ల చిత్రాలను సోషల్ మీడియాలో హైలైట్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు సైబరాబాద్ పరిధిలోని ఐటీ కంపెనీలతో ప్రభుత్వం చర్చించి స్టాగర్డ్ వర్కింగ్ అవర్స్. హైబ్రిడ్ డ్రైవ్‌లను ప్రోత్సహించడంతో పాటు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్న సూచనలు ప్రజల నుంచి వస్తున్నాయి. హైదరాబాద్‌కు ట్రాఫిక్ అనేది కేవలం ఒక రవాణా సమస్య కాదు, అది నగరం ఆర్థిక పురోగతికి, గ్లోబల్ బ్రాండ్ ఇమేజ్‌కు ముడిపడి ఉన్న అంశం. అధికారులు మసకబారిన పాత ప్రణాళికలను పక్కనపెట్టి, ప్రజా ప్రతినిధులు, పోలీసు శాఖ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాలను ఒకే తాటిపైకి తెచ్చి యుద్ధప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ ట్రాఫిక్ గందరగోళం ప్రభుత్వం పట్ల పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తిగా రూపాంతరం చెందడం ఖాయం. భవిష్యత్ లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేయవచ్చు కానీ ఇప్పుడు ప్రజలు భరించలేనంతగా కష్టపడితే ప్రభుత్వానికే ఇబ్బంది.

## రేవంత్ సర్కార్‌కు గుదిబండగా పొంగులేటి!?

**హైదరాబాద్, ఆగస్టు 20, పెన్ పవర్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా కనిపించిన సమాచార, పౌర సంబంధా, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చుట్టూ ఇప్పుడు వరుస వివాదాలు చుట్టుముడుతున్నాయి. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది సామాన్యుల ఆస్తులను తాకుతూ పెను దుమారాన్ని రేపుతున్న 22-ఎ సంక్షోభం రెవెన్యూ శాఖకు నేతృత్వం వహిస్తున్న పొంగులేటిని నేరుగా ఇరుకున పెట్టింది.మరోవైపు ఆయన కుటుంబ వ్యాపారాలు, వ్యక్తిగత వ్యవహారాలు నిరంతరం అధికార పక్షానికి తలనొప్పిగా మారుతున్నాయి. గతంలో ఆయన కుమారుడికి సంబంధించిన లగ్జరీ వాచీల స్మగ్లింగ్, హవాలా ఆరోపణల కేసుల్లో ఈడీ, డీఆర్ఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఆయన నివాసాలు, కార్యాలయాలపై వరుస దాడులు నిర్వహించడం ప్రభుత్వ ఇమేజ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. దీనికితోడు, గతంలో కేవలం ప్రభుత్వ కాంట్రాక్టులకే పరిమితమైన కుటుంబ సంస్థ 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' ఇటీవలి కాలంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోని వట్టినాగులపల్లి వంటి కీలక ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల భారీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లోకి ప్రవేశించడం, ఆ క్రమంలో భూ వివాదాలు, పోలీస్ కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.ప్రభుత్వంలో కీలక కాంట్రాక్టులు, ప్రాజెక్టులు ఒకే సంస్థకు దక్కుతున్నాయనే అసంతృప్తి కాంగ్రెస్ అంతర్గత విభాగాల్లోనూ క్రమంగా బయటపడుతోంది. గతంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వంటి సొంత పార్టీ శాసనసభ్యులే బహిరంగంగా ఆరోపణలు చేశారు. కొండా సురేఖ కూడా అదే తరహాలో ఆరోపణలు చేశారు. ఇక రెవెన్యూ శాఖలో కొనసాగుతున్న అవినీతిని, వివాదాస్పద భూములను ప్రొహిబిటెడ్ లిస్టులో పెట్టి సెటిల్మెంట్లు చేసుకుంటున్నారంటూ వస్తున్న ఆరోపణలతో అధికార పార్టీ మరింత ఆత్మరక్షణ ధోరణిలోకి పడిపోయింది. కేడర్ కోసం ఏళ్ల తరబడి పోరాడిన స్థానిక నేతలను విస్మరించి, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారన్న భావన క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో బలపడుతోంది.ఇన్ని ప్రతికూలతలు, వివాదాలు చుట్టుముట్టినా ఆయన పట్టు తగ్గకపోవడానికి ప్రధాన కారణం ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌తో ఉన్న బలమైన ఆర్థిక, రాజకీయ బంధాలేనని భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో పార్టీకి ఆర్థికంగా అండగా నిలవడం, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడల్లా వనరుల సమకూర్పులో కీలకంగా వ్యవహరించడం వల్లే ఆయన పలుకుబడి కొనసాగుతోందనే గుసగుసలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. పారదర్శక పాలన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రి పొంగులేటి చుట్టూ ముసురుకుంటున్న వివాదాలు ఒక పెద్ద 'మైనస్'గా మారాయన్నది క్యాడర్ అభిప్రాయం. సామాన్యుల ఆస్తి హక్కులను దెబ్బతీసే 22-ఎ వివాదం నుంచి మొదలుకొని, కుటుంబ వ్యాపార వివాదాల వరకు అన్నీ సర్కారు గ్రాఫ్‌ను దెబ్బతీస్తున్నాయిని అందరూ గట్టిగా నమ్ముతున్నారు

## పొంగులేటి వ్యాపారాలపై అనేక వివాదాలు

**ఖమ్మం, ఆగస్టు 20, పెన్ పవర్:**
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన పదవిలో ఉన్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చుట్టూ ముసురుకుంటున్న వరుస వివాదాలు ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంత్రాంగానికి పెద్ద పరిపాలనా, రాజకీయ సవాలుగా పరిణమించాయి. ప్రభుత్వంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తారనే పేరున్న పొంగులేటి, శాఖాపరమైన నిర్ణయాల్లో దొర్లిన తప్పిదాలు , వ్యక్తిగత, కుటుంబ వ్యాపార ఆరోపణల కారణంగా నిరంతరం వార్తల్లో నిలుస్తున్నారు. పరిపాలనాపరంగా ఇప్పటికే సవాళ్లు ఎదుర్కొంటున్న వేళ, స్వయంగా కీలక మంత్రి వివాదాల్లో చిక్కుకోవడం ప్రభుత్వాన్ని ప్రతిపక్షాల దాడికి సులభమైన లక్ష్యంగా మారుస్తోంది.సమస్యల్లో అత్యంత తీవ్రమైనది రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22-ఎ వివాదం. హైదరాబాద్ పరిసర జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డిల్లో పదిలక్షలకు పైగా ప్రైవేటు ఆస్తులు, అపార్ట్‌మెంట్లు అధికారులు రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలోకి చేర్చడంతో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సాధారణంగా రెవెన్యూ శాఖలోని సమస్యలను పరిష్కరించి పౌరులకు ఉపశమనం అందించాల్సి ఉండగా, ఈ కొత్త 22-ఎ ల్యాండ్ లాకింగ్ సమస్య దశాబ్దాల తరబడి ఉన్న ఇళ్లను కూడా వివాదంలోకి నెట్టింది. తీవ్ర నిరసనల అనంతరం మంత్రి పొంగులేటి బహిరంగ క్షమాపణలు చెప్పి, అధికారులపై తప్పు తోసేసి, టోల్‌ఫ్రీ నంబర్లు పెట్టినా.. నాటకీయమైన ఈ పరిణామాలు రేవంత్ ప్రభుత్వంపై పట్టణ మధ్యతరగతికి ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశాయి.పరిపాలనాపరమైన వైఫల్యాలకు తోడు ఆయన కుటుంబానికి చెందిన వ్యాపారాలు, లీగల్ సమస్యలు కాంగ్రెస్ సర్కార్‌కు మరింత ఇబ్బందికరంగా మారాయి. ఆయన కుమారుడు హర్షా రెడ్డికి సంబంధించిన కోట్లాది రూపాయల లగ్జరీ వాచీల స్మగ్లింగ్, హవాలా మరియు క్రిప్టోకరెన్సీ చెల్లింపుల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, డీఆర్ఐ ఆయన ఇళ్లు, కార్యాలయాల్లో వరుస సోదాలు నిర్వహించడం రాజకీయ కలకలం రేపింది. ఈ కేసుల దర్యాప్తు రేవంత్ ప్రభుత్వంపై అవినీతి ముద్ర పడేందుకు దోహదపడుతుందనే అభిప్రాయం కేడర్‌లో నెలకొంది. మరో ప్రధాన ఆరోపణ పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రాజెక్టులు, అలాగే మౌలిక వసతుల కాంట్రాక్టుల కేటాయింపు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టులు, పెద్ద కాంట్రాక్టుల ప్రక్రియలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అధిక ప్రాధాన్యత దక్కుతోందని, ప్రైవేటు ఆస్తి అభివృద్ధి వ్యాపార సంస్థలతో పొంగులేటికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ ఘాటు విమర్శలు చేస్తున్నాయి. కీలక మంత్రి వద్ద అధికారం ఉండటం వల్ల సొంత వ్యాపారాలకు లబ్ధి చేకూరుతోందనే ఆరోపణ ప్రతిపక్షాలకు విమర్శల అస్త్రంగా మారింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఇది మింగుడుపడని పరిణామంగా మారినట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకవైపు ప్రజాపాలన పేరుతో మెరుగైన ఇమేజ్ సాధించడానికి సీఎం ప్రయత్నిస్తుంటే, మరోవైపు రెవెన్యూలోని 22-ఎ గందరగోళం, ఈడీ, డీఆర్ఐ దాడులు, కేబినెట్ సహచరుల అసంతృప్తి వల్ల ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతింటోందనే ఆగ్రహం సీఎం స్థాయిలో ఉందనే ప్రచారం నడుస్తోంది. పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన శాఖలోని 22-ఎ సమస్యను ఎంత వేగంగా, పారదర్శకంగా పరిష్కరిస్తారనేది ఆయన రాజకీయ భవితవ్యానికే కాదు, మొత్తం కాంగ్రెస్ ప్రభుత్వ రేటింగ్‌కు అత్యంత ముఖ్యం.

# సాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకీ డైరక్ట్ వే...

**నల్గొండ, ఆగస్టు 20, పెన్ పవర్:** నాగార్జున సాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీకీ అనుసంధానించే 11.8 కి.మీ రహదారి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే ఉన్న 6 కి.మీ రహదారిని రెండు లైన్లుగా విస్తరించగా.. మరో 5.8 కి.మీ మేర టీజీఐఐసీ సేకరించిన భూముల్లో కొత్త రోడ్డును నిర్మిస్తున్నారు. మట్నొత్తం 7 మీటర్ల వెడల్పుతో భారీ వాహనాలకు అనుక్నరీలంగా ఈ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. ప్రాజెక్టుకు రూ.30 కోట్లు కేటాయించారు. రానున్న వారం రోజుల్లోనే ఈ ప్రాజెక్టు పనులు పూర్తయ్యే ఛాన్సుంది.తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లతో పాటు ఫోర్త్ సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నారు. ఇప్పటికే అక్కడ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో పాటు పలు కార్యాలయాల పనులు మట్నదలయ్యాయి. ఇక ఫ్యూచర్ సిటీని చేరుకునేందుకు ప్రత్యేకంగా రోడ్లు కూడా వేయిస్తున్నారు. ఫ్యూచర్ సిటీకి రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా తాజాగా మరో కీలక అడుగు పడింది. నాగార్జునసాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని కనెక్ట్ చేసే రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. యాచారం మండలం తక్కళ్లపల్లి గేట్ నుంచి మేడిపల్లి సమీపం వరకు కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే ఫ్యూచర్ సిటీకి మరో రోడ్డు అందుబాటులోకి రానుంది. అక్కడ చేపట్టనున్న నిర్మాణాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు అవసరమైన సామగ్రి రవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆధునీకరించడంతో పాటు అవసరమైన చోట కొత్త రహదారిని అధికారులు నిర్మిస్తున్నారు. మొత్తం 11.8 కిలోమీటర్ల పొడవున ఈ మార్గాన్ని అత్యాధునికంగా డెవలప్ చేస్తున్నారు. యాచారం మండలం తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో ఇప్పటికే ఉన్న సుమారు 6 కిలోమీటర్ల పొడవైన ఒక వరుస రహదారిని రెండు వరుసలుగా విస్తరించారు. మరో 5.8 కిలోమీటర్ల మేర మేడిపల్లి నుంచి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సేకరించిన భూముల్లో కొత్తగా మరో రహదారిని నిర్మిస్తున్నారు.ఈ కొత్త రహదారి కోసం తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల పరిధిలో రైతుల నుంచి సుమారు ఏడు ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. మొత్తం రోడ్డును ఏడు మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. రానున్న కాలంలో ఫ్యూచర్ సిటీ పరిధిలో భారీ స్థాయిలో నిర్మాణాలు చేపట్టనున్న నేపథ్యంలో భారీ వెహికల్స్ సైతం సులభంగా రాకపోకలు సాగించేలా ఈ కొత్త రహదారి నిర్మాణానికి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో రోడ్లు, కనెక్టివిటీ కీలక మౌలిక వసతులుగా మారనున్నాయి. కొత్త పరిశ్రమలు, సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు, ఇతర నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఉక్కు, యంత్ర సామగ్రి తదితరాలను తరలించేందుకు ప్రత్యేకంగా అనుకూలమైన రోడ్లను అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీ వైపు నిర్మిస్తున్న ఈ రోడ్డు కీలక రవాణా మార్గంగా ఉపయోగపడనుంది.ఈ రహదారి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.30 కోట్లు కేటాయించింది. తారు నిర్మాణ పనులను రెండు రోజుల క్రితమే ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే రానున్న వారం రోజుల్లోనే పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని టీజీఐఐసీ జెడ్ఎం స్మరత్‌చంద్ర తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలన్న రేవంత్ సర్కార్ ప్రణాళికలో భాగంగా కనెక్టివిటీకి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రధాన రహదారులతో అనుసంధానం పెరిగే కొద్దీ భవిష్యత్తులో ఈ ప్రాంతంలో రవాణా, పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు మరింత వేగం పుంజుకునే ఛాన్సుంది. ప్రస్తుత రహదారి పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులకు మాత్రమే కాకుండా పరిసర గ్రామాలకు కూడా మెరుగైన కనెక్టివిటీ లభించనుంది.

# పీఆర్‌టీయూటీఎస్ ఎన్నికల్లో నూతన కార్యవర్గం ఎన్నిక


మండల అధ్యక్షుడు చింత నిప్పు రమేష్


మండల కార్యదర్శి భూక్య రమేష్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 20:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం పీఆర్‌టీయూ టీఎస్ సంఘంతోనే సాధ్యమని మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మిర్యాల సతీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాగర్లమూడి శ్రీధర్ లు అన్నారు.గార్ల మండల కేంద్రంలోని స్థానిక గర్ల్స్ హై స్కూల్ లో గురువారం నిర్వహించిన మండల శాఖ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు కల్పించడంలో పీఆర్‌టీయూ టీఎస్ సంఘం కీలక పాత్ర పోషించిందని తెలిపారు.రానున్న రోజుల్లో సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు, అందరికీ ఆమోదయోగ్యమైన వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) సాధన కోసం తమ సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన గార్ల మండల పీఆర్‌టీయూ టీఎస్ శాఖ ఎన్నికల్లో మిరియాల సతీష్ రెడ్డి చాగర్లమూడి శ్రీధర్ ప్యానల్ ఘన విజయం సాధించింది.గార్ల మండల పీఆర్‌టీయూ టీఎస్ నూతన అధ్యక్షుడిగా చింత నిప్పు రమేష్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రమేష్ లు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా సురేందర్ రెడ్డి మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా జ్యోతి పి ఆర్ టి యు , ఉపాధ్యక్షులుగా కిరణ్ మహిళా ఉపాధ్యక్షురాలుగా మంజుల పి ఆర్ టి యు కార్యదర్శిగా మాటేటి వెంకటేశ్వరరావు గార్ల మండలం మహిళా కార్యదర్శిగా అశ్విని ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు.
ఈ కార్యక్రమంలో డోర్నకల్ పిఆర్టియు మండల అధ్యక్షుడు ప్రభుదాస్ బయ్యారం పిఆర్టియు మండల అధ్యక్షుడు మోహన్ నరసింహుల పేట పిఆర్టియు మండల అధ్యక్షుడు పూర్ణచందర్ నెల్లికుదురు పిఆర్టియు మండల అధ్యక్షుడు యుగంధర్ కేసముద్రం పిఆర్టియు మండల అధ్యక్షుడు శ్రీధర్ పి ఆర్ టి యు సీనియర్ సభ్యులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గర్ల్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ గార్ల మండల పిఆర్టియు జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీ పి ఆర్ టి యు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు జిల్లా బాధ్యులు వినోద్ మండల బాధ్యులు రమేష్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

## శక్తి స్కీమ్, జీవో-97ను వెంటనే రద్దు చేయాలి


మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 20:** విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదని 'శక్తి' స్కీమ్, జీవో 97ను వెంటనే రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపాలిటెక్నిక్ విద్యార్థులు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడానికి పోలీసు బలాన్ని ఉపయోగించడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని పేర్కొన్నారు.విద్యార్థులపై పోలీసులు కఠినంగా వ్యవహరించిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. విద్యార్థులపై దాడులకు పాల్పడిన పోలీసు అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అక్రమంగా నిర్బంధించిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని కోరారు.
'శక్తి' స్కీమ్, జీవో--97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల ఉన్నత విద్య, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతుందన్న ఆందోళనలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం తక్షణమే వారితో చర్చలు జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థుల గొంతు నొక్కితే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు.

## నిన్న నల్గోండ... ఇవాళ వరంగల్...కాంగ్రెస్ లో కల్లోలం

**హైదరాబాద్, ఆగస్టు 20 పెన్ పవర్:** లంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అధికార కాంగ్రెస్‌లో అంతర్గత ముసలం రోజు రోజుకూ ముదురుతోంది. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారు. మొన్నటి వరకు మంత్రి పదవి కోసం ప్రయత్నించాడు. విఫలం కావడంతో తిరుగుబాట పట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా పరకాల జరిగిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలు మరోమారు చర్చనీయాంశమయ్యాయి. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించాయి. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయించాలని, ఆయనను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఇవి తన మంత్రివర్గ సహచరురాలు కొండా సురేఖకు షాక్ ఇచ్చాయి. పరకాల సీటు తన కూతురుకు ఇప్పించాలని మంత్రి కంటున్న కలలు కల్లలయ్యాయి.ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా సురేఖకు, ఇతర ఎమ్మెల్యేలకు మధ్య సఖ్యత కొరవడింది. కొండాపై ఇటీవలే ఉమ్మడి జిల్లా నేతలు సీఎంకు, పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. కొండా మురళి అరాచకాలనూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పరకాల సభలో రేవంత్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కృషిని ప్రశంసించారు. ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన పనులను గుర్తు చేస్తూ, వచ్చే ఎన్నికల్లో కూడా ఆయననే గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఇది సాధారణ ప్రోత్సాహం కాకుండా, స్పష్టమైన రాజకీయ సంకేతం. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, సీఎం స్థాయిలో ఇలా పేరు తీసుకుని మాట్లాడటం అరుదు. దీంతో పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అధికార పార్టీలో బలమైన మద్దతు ఉన్నట్లు స్పష్టమైంది.మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి గత కొన్ని నెలలుగా తమ కుమార్తె సుష్మితను పరకాల నుంచి బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కుటుంబం పరకాలను తమ రాజకీయ కంచుకోటగా భావిస్తూ, సుష్మితను తదుపరి తరం నాయకురాలిగా నిలబెట్టాలని చూస్తున్నారు. గతంలో కూడా సురేఖ పరకాల నుంచి పోటీ చేసిన నేపథ్యం ఉంది. కానీ సీఎం నేరుగా ప్రస్తుత ఎమ్మెల్యే పేరు చెప్పి మద్దతు తెలపడంతో కొండా కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, సీఎం ఉమ్మడి వరంగల్ పర్యటనలో కొండా సురేఖ--మురళి దంపతులు హాజరు కాలేదు. మేడారం నుంచి పరకాల వరకు జరిగిన కార్యక్రమాల్లో వారు కనిపించకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమతుల్యతను సూచిస్తోంది. సీఎం స్థానిక ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇస్తూ, కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలనే సందేశం ఇచ్చినట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి బలమైన స్థానిక నాయకుడిగా ఉన్నారు. ఆయనను కొనసాగించడం ద్వారా పార్టీలో స్థిరత్వం కాపాడుకోవాలని సీఎం భావించి ఉండవచ్చు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. టిక్కెట్ పంపిణీ అధికారికంగా జరగాల్సి ఉంది. కొండా కుటుంబం ఇప్పుడు ఎలా స్పందిస్తుందో, సుష్మిత ఏమి చేస్తారో చూడాలి. పార్టీలోని ఇతర నాయకులు కూడా ఈ సంకేతాన్ని గమనిస్తూ ఉంటారు.మొత్తంగా చూస్తే పరకాల సభ ద్వారా కొండా కుటుంబం పెద్ద అండ కోల్పోయినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సురేఖ పనితీరుపై సీఎం అసంతృప్తిగా ఉన్నారు. ఆమెకే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తారా లేదా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు ఆమెతోపాటు ఆమె కుటుంబానికి షాక్ ఇచ్చారు. సీఎం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

# పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా.. జీఓను రద్దు చేయాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ , స్కిల్ యూనివర్సిటీలలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన 'శక్తి స్కీమ్' మరియు సంబంధిత జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మధిర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘం నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి మధిర పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను ఇతర సంస్థల్లో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే 'శక్తి స్కీమ్'ను, సంబంధిత జీఓను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ ఆందోళనలో విద్యార్థులు, ఎస్ ఎఫ్ ఐ నాయకులు పాల్గొన్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాజీవ్ గాంధీ గారు చిరస్మరణీయుడు: దేప భాస్కర్ రెడ్డి

**ఎల్బీనగర్ , పెన్ పవర్ ఆగస్టు 20:** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మీర్‌పేట్‌లోని ప్రశాంత్ హిల్స్ 58వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు ప్రాధాన్యతనిస్తూ దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీ బాధ్యులు, సమన్వయకర్త ధరవత్ స్వామి నాయక్తో పాటు పోటీ చేసిన కార్పొరేటర్లు, మాజీ సహ-ఆప్షన్ సభ్యులు, కమిటీ బాధ్యులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న నేతలు

# ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి


నివాళులు అర్పిస్తున్న సిపిఎం పార్టీ నాయకులు

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 20:**
అమరజీవి ఇస్లావత్ రావూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళులు అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందుకూరి శ్రీనివాస్ అన్నారు.ఇస్లావత్ రావూజీ వర్ధంతి వేడుకలను వెంకటాపురం క్రాస్ రోడ్ లోని స్తూపం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పూల మాలతో నివాళు లర్పించి ఘనంగా నిర్వహించారు.భాగం లోకేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభ లో ఆయన మాట్లాడుతూ బుద్ధారం పంచాయతీ లో బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలపై ఈ ప్రాంతానికి చెందిన అమరులు తాళ్లూరి నర్సింహారావు, పోటు వీరభద్రం వంటి నాయకులతో కలిసి అనేక ఉద్యమాలు చేసారని అన్నారు. బుద్ధారం, బుద్ధారం తండా, వెంకటాపురం, కంసలి తండా ప్రాంతాల లో దళితులు, గిరిజనులకు ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో సిపిఎం, గిరిజన సంఘాలు నిర్వహించిన పోరాటం లో ముఖ్య భూమిక పోషించారన్నారు. నిత్యం ప్రజలలో ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతున్న రావూజీ ఎదుగుదలను చూడలేని ఈ ప్రాంత కాంగ్రెస్ గుండాలు నమ్మకద్రోహంతో అతికిరాతకంగా చంపారని అన్నారు. రావూజీ ని చశీపి దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తున్న ఆయన ఆశయాన్ని మాత్రం చంపలేరని అన్నారు. పేద ప్రజలు, గిరిజనుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ఈ ప్రాంతంలో సిపిఎం పార్టీకి పూర్వ వైభవశీ తీసుకరావడమే రావూజీకి ఇచ్చే నిజమైన నివాళులని అన్నారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం మండల నాయకులు జి. రాజారావు,వి.పి వెంకటేశ్వర్లు,ఏ. వీరాస్వామి,ఐ. గోవింద్,సిహెచ్. ఎల్లయ్య,బి. ఉపేందర్ రెడ్డి,సిహెచ్. మౌనిక, జి.వశ్యా, బట్టు లక్ష్మయ్య, నంద్యా, ఎస్ కె.మౌలానా, జి. వీరభద్రం,టి. నాగేశ్వరావు,లక్ష్మయ్య,వి. కొండయ్య,నవీన్,మల్లయ్య, ప్రవీణ్,సర్వర్,శంకర్,వీరయ్య, ఇస్లావత్ అశోక్, ఇస్లావత్ కీర్తి,ఇస్లావత్ సాయి, ఇస్లావత్ సత్య, ఇస్లావత్ విజయ,సత్య,ఇస్లావత్ మంగీలాల్,ఇస్లావత్ రాము,సిపిఎం,అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**గార్ల, పెన్ పవర్, ఆగస్టు 20:** రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ స్మరణీయమని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భానోత్ పార్వతి హతిరాం నాయక్ అన్నారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని గార్ల మండల కేంద్రంలోని స్థానిక సీతంపేట రోడ్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు తొలుత రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ శంషాద్ బేగం లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లడంలో రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రగతికి పునాది వేశాయని పేర్కొన్నారు.యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించడంతో పాటు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యంలో యువత భాగస్వామ్యాన్ని పెంచారని తెలిపారు. గ్రామీణాభివృద్ధికి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి రాజీవ్‌గాంధీ చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడెం పంచాయతీ సర్పంచ్ బానోత్ రామ్ సింగ్ నాయక్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడ్ల అప్పయ్య గార్ల పట్టిన కాంగ్రెస్ అధ్యక్షులు పళ్ళ నరసయ్య బానోత్ హతిరాం నాయక్ ఉప సర్పంచ్ ఎర్రగడ్డ శ్రీనివాస్ వార్డు సభ్యులు సారయ్య పృధ్వీరాజ్ మళ్లీ బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు దీకొండ రాము రహీంఖాన్ బాబులాల్ కోల కుమార్ సర్వీస్ నాయక్ రాజశేఖర్ మంద రవి తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

# కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు

**విజయవాడ, ఆగస్టు 20, పెన్ పవర్:**
ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఏపీ ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకుగానూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటోంది.కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి ఉంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు రాజుజ నోటిఫికేషన్ (నెం.401/రాజుజ–ఖీ1/2026–1) జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.

1986 తర్వాత డైరక్ట్ఎలక్షన్స్

ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను చేపట్టింది. ఈ బిల్లును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం నాడు సభలో ప్రవేశపెట్టారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధానానికి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలను వెల్లడించారు. 1986 వరకు పరోక్ష ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. అయితే 2005 నుంచి పరోక్ష ఎన్నికలు సాగుతున్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికి అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకోవడం వల్ల ఆ పదవుల్లో ఉన్నవారికి నమ్మకమైన ప్రజామోదం లభిస్తుందన్నారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవడం వల్ల మేయర్, చైర్మన్లపై వారి అనవసర ప్రభావం ఉండదని స్పష్టం చేశారు.ఈ విధానం వల్ల వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం దక్కుతుందని, నగరాలు, పట్టణాలలో అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయవచ్చని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి మౌలిక వసతుల కల్పనలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం సాధ్యమవుతుంది అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని చెప్పారు.నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యక్షంగా ఎన్నికైన మేయర్ లేదా చైర్మన్‌కు పూర్తి వెసులుబాటు ఉంటుందని మంత్రి నారాయణ వివరించారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల అనవసర రాజకీయ ప్రభావం తగ్గి, ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నేతలు పట్టణాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సానుకూల ప్రయోజనాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే చట్ట సవరణ తెచ్చామని వివరించడంతో, బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దాంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష ఎన్నికల విధానంలో జరగనుంది.

# పాపం..వంశీమోహన్ కర్మ రిటర్న్స్

**విజయవాడ, ఆగస్టు 20, పెన్ పవర్:**
ఉమ్మడి కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని నాయకుడిగా, గన్నవరం నియోజకవర్గంలో చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరిస్థితి ఇప్పుడు సొంత పార్టీలోనే అత్యంత దయనీయంగా మారిందనే చర్చ జోరందుకుంది. వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు విమానాశ్రయానికి వెళ్లిన వంశీకి అక్కడ విచిత్రమైన, అవమానకరమైన పరిస్థితి ఎదురైంది. విఐపీ విభాగానికి లేదా ప్రత్యేక పరిధికి అనుమతి దక్కకపోవడంతో, ఆయన సాధారణ కార్యకర్తలు, అభిమానులతో పాటు బారికేడ్ల వెనుక నిలబడాల్సి వచ్చింది. జగన్ బయటకు వచ్చే క్రమంలో ఆయన దృష్టిలో పడేందుకు మిగతా వారితో పాటు తోసుకుంటూ వెళ్లి పలకరించడానికి ప్రయత్నించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.ఒకప్పుడు నియోజకవర్గంలో సొంత ముద్ర వేసుకుని, అసెంబ్లీలోనూ బలమైన నేతగా నిలిచిన వంశీలాంటి సీనియర్ నేత.. ఈ రకంగా పలకరింపు కోసం నిలబడటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలు బయటకు రావడంతో సోషల్ మీడియా నెటిజన్ల నుంచి, ఆయన అభిమానుల నుంచి విభిన్న ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గన్నవరంలో ఒక వెలుగు వెలిగిన నాయకుడికి, ఈరోజు సొంత పార్టీ అధినేతను కనీసం గౌరవగా పలకరించే వెసులుబాటు కూడా లేకపోవడం ఏంటి అంటూ పలువురు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అతి రాజకీయాలే ఆయనను ఈ స్థితికి తెచ్చాయని విమర్శిస్తున్నారు.ఈ ఘటనతో వల్లభనేని వంశీ అనుచరులు, స్థానిక వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో గుసగుసలాడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో సుదీర్ఘకాలం కీలకంగా వ్యవహరించి, పార్టీ కోసం అనేక రకాల సవాళ్లను ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యేలకు, సీనియర్ నాయకులకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఈ రకంగా విమానాశ్రయం బయట రోడ్డుపై లేదా బారికేడ్ల వెనుక నిలబెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. పార్టీ నాయకత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, జగన్‌ను విడిగా కలిసే సమయాన్ని లేదా తగిన గౌరవాన్ని కల్పించి ఉండాల్సిందని స్థానిక నాయకత్వం బహిరంగంగానే పెదవి విరుస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత వైఎస్ఆర్‌సీపీలో లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్ స్పష్టంగా
కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు నడిచిన వ్యవస్థ వేరు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రేణులను, సీనియర్ నేతలను గౌరవించుకునే విధానం వేరు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడిన మాజీ ఎమ్మెల్యేలను ఇలా సాధారణ కేడర్ తరహాలో నెట్టివేస్తే, రాబోయే రోజుల్లో మిగతా నేతల్లో కూడా నిరాశ పెరిగి పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వంశీకి జరిగిన ఈ వీధి పరాభవం ద్వితీయ శ్రేణి నాయకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే అంశంగా మారింది. గన్నవరం రాజకీయంలో ఎంతో ప్రాబల్యం ఉన్న వల్లభనేని వంశీకి ఎదురైన ఈ అనుభవం.. వైఎస్ఆర్‌సీపీలో నేతలకు దక్కుతున్న ప్రాధాన్యతపై అనుమానాలు రేకెత్తిస్తోంది. కేవలం ప్రచారానికి, కార్యకర్తలను సమీకరించడానికే సీనియర్లను వాడుకుని, అధినేతను కలిసే సమయంలో సాధారణ జనంలా నిలబెట్టే సంస్కృతి తగదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు.

# మళ్లీ మీమర్లు, ట్రోలర్లకు పనిచెప్పిన జగన్ రెడ్డి! మీడియా మీట్ లో వ్యాఖ్యలు వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తాను మాట్లాడాల్సిన అంశాలు అన్నీ చాలానే ఉన్నప్పటికీ ఇప్పుడు రెండు అంశాలే మాట్లాడతానని, మళ్లీ వారం మాట్లాడటానికి కొన్ని అంశాలను వాయిదా వేస్తున్నట్లు జగన్ రెడ్డి చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి. అన్నీ ఇప్పుడే మాట్లాడేస్తే ఓవర్ డోస్ అయిపోతుందంటూ జగన్ రెడ్డి వ్యాఖ్యానించడంపై పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇరుకన పెట్టే సమాచారం సిద్ధంగా ఉన్నప్పుడు ఇంకో వారం కోసం ఆగడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.
మాజీ సీఎం జగన్మోహనరెడ్డి మీడియా సమావేశాలలో ఏదో ఒక పొరపాటు చేస్తూ ట్రోలర్లు, మీమర్స్ కి కంటెంట్ లోటు లేకుండా చేస్తారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే అసెంబ్లీకి రానంటూ భీష్మించుకుని కూర్చున్న మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, అసెంబ్లీ జరుగుతున్న సమయంలో తన అభిప్రాయాలను మీడియాతో పంచుకుంటానని గతంలో చెప్పిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే గురువారం అసెంబ్లీలో జరుగుతున్న డీఎస్సీపై చర్చపై మాజీ సీఎం జగన్ మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం సరిగా సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలిలో తమ పార్టీ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సివస్తుందనే భయంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ మండలి వైపు చూడటం లేదని జగన్ విమర్శలు గుప్పించారు. డీఎస్సీపై మాజీ సీఎం చేసిన ఈ విమర్శలను రాజకీయ కోణంలో చూస్తున్న పరిశీలకులు, అదే సమయంలో ఆయన అనవసర వ్యాఖ్యలతో లేనిపోని విమర్శలు ఎదుర్కొంటున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. “నాణేనికి ఇటు వైపున రెండు ప్రధాన అంశాలను టచ్ చేస్తా, టచ్ చేయాల్సిన అంశాలు ఇంకా చాలా ఉన్నప్పటికీ.. మళ్లీ నెక్స్ట్ కూడా మళ్లీ ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ కంటిన్యూ చేస్తా. లేదంటే ఇదే కాన్ఫరెన్సులో అన్నీ సబ్జెక్టులు తీసుకువచ్చేస్తే ఓవర్ డోస్ అయిపోతుంది” అంటూ జగన్ రెడ్డి చెప్పారు. దీంతో ఆయన వ్యాఖ్యలను మీమర్స్, ట్రోలర్లు సోషల్ మీడియాలో తిప్పుతున్నారు.
విపక్షంగా సమర్థంగా పనిచేసి ప్రజల అభిమానాన్ని చూరగొనాల్సిన మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అంశాలు సిద్ధంగా ఉన్నప్పుడు ఓవర్ డోస్ అయిపోతుందని జాలి చూపడమే అంతుచిక్కడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. డీఎస్సీపై మంత్రి లోకేశ్ బహిరంగ చర్చకు రమ్మంటూ సవాల్ విసురుతున్నా పట్టించుకోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తన ప్రెస్ మీట్ లో పాత విషయాలనే మళ్లీమళ్లీ లేవనెత్తారని అంటున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఇప్పటికే అనేక విధాలుగా ఆందోళన చేస్తున్న వైసీపీ ఆ విషయంలో ఎంతవరకు అడ్వాంటేజ్ పొందిందో తెలియనప్పటికీ, అంతకంటే తీవ్రమైన అస్త్రాలు సిద్ధంగా ఉన్నప్పుడు ఇంకా వేచిచూడటం ఎందుకంటూ పరిశీలకులు సంధిస్తున్న ప్రశ్నలకు వైసీపీ నుంచి ఎటువంటి సమాధానం వస్తుందో చూడాల్సివుందని అంటున్నారు.

## దసరాలో లోకల్ సందడి

**విశాఖపట్టణం, ఆగస్టు20, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో భారీ ఎన్నికల సమరానికి తెరలేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల సమగ్ర అధ్యయనం కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికలో సిఫారసు చేసిన దాని కన్నా ఎక్కువగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెప్టెంబర్ మొదటి వారంలోనే వార్డుల వారీగా తుది ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్లు సాగితే సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ నెలల మధ్యలో ఏపీ అంతటా స్థానిక ఎన్నికల హడావుడి రావడం ఖాయంగా కనిపిస్తోందిఈసారి ఎన్నికల నిర్వహణలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓటర్ల జాబితా ఎంపిక. ఓటర్ల జాబితా సవరణ సుదీర్ఘ ప్రక్రియ వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 2025 నాటి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రాతిపదికన ఎన్నికలకు వెళ్లాలని ఎస్ఈసీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సవరణలతో పాటు ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ను మించి దాదాపు 34% వరకు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సాంకేతిక, పరిపాలనా ముందడుగులు పరిశీలిస్తే ఎన్నికలను మళ్లీ వాయిదా వేసే ఉద్దేశంలో ప్రభుత్వం లేదని స్పష్టమవుతోంది.కూటమి ప్రభుత్వానికి ఈ స్థానిక ఎన్నికలు తమ రెండు సంవత్సరాల పరిపాలనా పనితీరుకు, ప్రజాదరణకు మొదటి అధికారిక టెస్ట్ లాంటివి . సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన భారీ విజయం తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల వేవ్ ఉండటం సహజం. మరోవైపు, పరాజయం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్న వైఎస్సార్ సీపీకి ఈ స్థానిక సమరం ఊపిరి పీల్చుకునే అత్యంత కీలకమైన వేదిక. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న వైసీపీ, స్థానిక సంస్థల ద్వారా క్షేత్రస్థాయి క్యాడర్‌లో మళ్లీ ఉత్సాహం నింపాలని భావిస్తోంది. గత ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధుల బలంతో పాటు,వైసీపీ శ్రేణులు కనీసం వార్డు, పంచాయతీ స్థాయిలో పట్టు నిలుపుకోగలిగితే పార్టీకి కొత్త పునాది లభిస్తుంది. అందువల్లే, ప్రభుత్వం ఎంత వేగంగా ఎన్నికలకు వెళ్లినా వైసీపీ కూడా వెనకడుగు వేయకుండా పోరుకు సిద్ధమవుతోంది.ఎన్నికల వ్యూహాల పరంగా చూస్తే.. స్థానిక పోరులో పార్టీ గుర్తుపై జరిగే మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోల్స్ ఒకెత్తయితే, పార్టీ గుర్తులేని ఎన్నికలు మరొకెత్తు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఉండే పాత కక్షలు, వర్గపోరు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రకమైన రాజకీయ సమీకరణాల్లో అధికార కూటమి మధ్య సీట్ల సర్దుబాటు కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ పరీక్షగా మారే ప్రమాదం కూడా ఉంది. దీన్ని వైకాపా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పూర్తి రాజకీయ వేడిని నింపబోతున్నాయి. పొలిటికల్ అట్మాస్ఫియర్ అంతా గ్రామ సర్పంచ్ నుండి మున్సిపల్ ఛైర్మన్ల దాకా ఆశావాహుల హడావుడితో మారబోతోంది. ఒకవైపు ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని దిగువ స్థాయి దాకా విస్తరించాలని భావిస్తుంటే, మరోవైపు ఉనికి చాటుకోవడానికి వైసీపీ పోరాడుతోంది. కాబట్టి రాబోయే రెండు నెలలు ఏపీ వ్యాప్తంగా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల చుట్టూ తిరిగే ఓట్ల పోరాటం అత్యంత ఉత్కంఠభరితంగా సాగడం ఖాయం.=

## వెనక్కి వచ్చేస్తున్న గుంటూరు మిర్చి

**గుంటూరు, ఆగస్టు 20, పెన్ పవర్:** మన గుంటూరు మిర్చి విదేశాల్లో ఉన్న గిరాకీని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, అదంతా అప్పుడు.. ఇప్పుడు విదేశాలకు వెళ్లిన మన మిర్చి తిరిగి వెనక్కి వచ్చేస్తోంది. దానికి అసలైన కారణం రసాయనాలు ఎక్కువగా వాడటం. పురుగుమందు అవశేషాలు ఎక్కువగా ఉండటంతో చైనా, శ్రీలంక వంటి దేశాలు మన మిర్చి ఉన్న కంటైనర్లను తిరిగి పంపించేసింది. ఇలాంటి సమయంలో రైతులు పాటించాల్సిన కొన్ని సూచనలను లాంఫాం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేఫ్ కెమికల్స్ వాడితే విదేశాల్లో డిమాండ్ వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.గుంటూరు మిర్చికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఈ మిర్చి కోసం విదేశీయులు కూడా పోటీపడేవారు. అయితే, ఇటీవల కాలంలో గుంటూరు మిర్చి ఏ దేశానికి వెళ్లిన తిరిగి మనకే వస్తుంది. దానికి అసలైన కారణం రసాయనాలు వాడటం. రసాయన అవశేషాలు.. అఫ్లాటాక్సిన్.. తేమశాతం ఎక్కువగా ఉందన్న కాలరణాలతో మిర్చిని తిరస్కరిస్తున్నాయి. ఇటీవల చైనా, శ్రీలంక దేశాలు మిరప కంటైనర్లను వెనక్కి తిరిగి పంపించాయి. ఇంకొన్ని దేశాలయితే ఆంక్షలు విధిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మిర్చికి మంచి డిమాండ్ రావాలంటే లాంఫాం శాస్త్రవేత్తలు కొన్ని సూచనలు అందజేస్తున్నారు.ప్రస్తుతం మిర్చికి చీడపీడలు ఎక్కువగా పడుతుండటంతో రసాయనాలు వాడాలని రైతులు అంటున్నారు. అయితే, రసాయనాలు వాడకుండా కూడా మిర్చికి మంచి దిగుబడి తీసుకురావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సూచిస్తున్నారు. మిరపకు సోకే పరుగులు, తెగుళ్ల వ్యాప్తిని తొలి దశలోనే గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని చెబుతున్నారు.లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాల ఏర్పాటుతో పాటు పంటలో అక్కడక్కడ బంతి, ఆముదం మొక్కలను ఎర పంటలుగా వేయాలని చెబుతున్నారు. ఒకవేళ రసాయనాలు వాడాల్సి వస్తే సేఫ్ కెమికల్స్ చల్లుకోవాలని సూచించారు. కాయలు కోయడానికి 25 రోజుల ముందుగా మాత్రమే రసాయనాలు చల్లాలని, దీని వల్ల పంటలో రసాయన అవశేషాల ప్రభావం చాలా వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.పంట కోతకి వచ్చినప్పుడు పూర్తిగా కాయ పండిన తర్వాతే కోసి ఆరబెట్టాలని, అప్పుడు మాత్రమే అమ్మకానికి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేసేటప్పుడు కాయలను బాగా ఎండేలా చూడాలంటూ లాంఫామ్ శాస్త్రవేత్తలు వివరించారు.మన దగ్గర పండే మిరప సుమారు 30 శాతానికి పైగా ఎగుమతి అవుతుంది. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, సింగపూర్, మలేషియాతో పాటు మిడిల్ ఈస్ట్ ప్రాంతాల్లో మన మిరపకు మంచి డిమాండ్. ఈ దేశాలన్నీ తమకు దిగుమతి అయ్యే పంటలో రసాయనాలు తక్కువగా ఉండేలా ఆహార ప్రమాణాలు సవరించాయి. దాంతో మన మిరప రైతులు కూడా వాటికి తగ్గట్టుగానే సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే మంచి గిరాకీ వచ్చే అవకాశం ఉంది

## బొత్స అనూష పొలిటకల్ ఎంట్రీ...

**విజయనగర్, ఆగస్టు 20, పెన్ పవర్:** మాజీ మంత్రి, వైసీపీ నేతబొత్స సత్యనారాయణ కుమార్తె అనూష రాజకీయ రంగ ప్రవేశంపై క్లారిటీ వచ్చింది. బుధవారం రోజు మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన వారసురాలి రాజకీయ రంగ ప్రవేశంపై బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్య లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనూష పోటీ చేస్తుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఏ పద్ధతిలో జరిగినా, పోటీ చేయడం పక్కానని క్లారిటీ ఇచ్చారు. దీంతో బొత్స కుటుంబం నుంచి మరో తరం పొలిటికల్ ఎంట్రీకి ముహూర్తం ఖరారైందని రాజకీయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు బొత్స అనూష వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి అనూష బరిలోకి దిగుతూ ఉండటంతో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికలు ఈసారి మరింత ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌లో బొత్స కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. 1978లో విద్యార్థి నేతగా బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు అయ్యారు. 1999లో కాంగ్రెస్ తరుఫున బొబ్బిలి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ.. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. ఏపీసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.2014లో రాష్ట్ర విభజన తర్వాత వైసీపీలో చేరిన బొత్స.. జగన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కూడా రాజకీయాల్లో రాణించారు. రెండుసార్లు విజయనగరం జెడ్పీ ఛైర్ పర్సన్‌గా, ఓసారి విజయనగరం ఎంపీగా వ్యవహరించారు. బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య 2019 ఎన్నికల్లో గజపతినగరం నుంచి వైసీపీ తరుఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బొత్స కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తున్న నాలుగో వ్యక్తిగా బొత్స అనూష నిలవనున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ‘మా వాళ్లు 3,000 మంది బయటే ఉన్నారు’..

# షహజాద్ భట్టీ సంచలన వ్యాఖ్యలు



భారత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా సంస్థలు విస్తృతంగా చర్యలు చేపడుతున్న వేళ పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ షహజాద్ భట్టీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇటీవల 253 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం వెల్లడించిన నేపథ్యంలో భట్టీ ఓ వీడియోలో స్పందిస్తూ.. అరెస్టైన వారిలో తమ నెట్‌వర్క్‌కు చెందినవారు లేరని చెప్పుకొచ్చాడు. అంతేకాదు భారత్‌లో తమ నెట్‌వర్క్‌కు చెందిన సుమారు 3,000 మంది ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారని అతడు పేర్కొనడం భద్రతా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అరెస్టైన వారిని ‘సీజేపీ సభ్యులు’గా పేర్కొన్న భట్టీ.. వారి ముఖాలను ప్రజలకు చూపించాలని సవాల్ చేశాడు. అవసరమైతే వారికి న్యాయపరమైన, ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించాడు. అతడి ప్రకటనపై భారత భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోనూ భట్టీ నెట్‌వర్క్‌కు సంబంధించిన లింకులు వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. యూసుఫ్‌గూడ, మేడ్చల్ ప్రాంతాల్లో దర్యాప్తు సంస్థలకు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. గతంలో అరెస్టైన ఇద్దరు యువకులకు ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**సోషల్ మీడియా ద్వారా నెట్‌వర్క్ విస్తరణ?**

దర్యాప్తులో గాజియాబాద్‌కు చెందిన 22 ఏళ్ల జాయిద్ ఖాన్ పేరు కీలకంగా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అతడు ఫిబ్రవరిలో మేడ్చల్‌లోని ఓ రెస్టారెంట్‌లో పనిచేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా ఐఎస్ఐ సానుభూతిపరులతో పరిచయం ఏర్పడి అనంతరం వారితో ఆన్‌లైన్‌లో చాటింగ్ చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. హమీద్, రాణా హుస్సేన్ అనే వ్యక్తులతో అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ గుర్తించినట్లు సమాచారం.

**ఎవరీ షహజాద్ భట్టీ?**

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాద్ భట్టీ.. నేర ప్రపంచం నుంచి సోషల్ మీడియా వరకు తన ప్రభావాన్ని విస్తరించుకున్న వ్యక్తిగా భారత దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. దోపిడీలు, బెదిరింపులు వంటి నేరాలతో ప్రారంభమైన అతడి ప్రస్థానం లాహోర్ అండర్‌వరల్డ్‌తో సంబంధాల వరకు వెళ్లినట్లు సమాచారం. 2013లో అతడిపై పలు కేసులు నమోదయ్యాయని, అనంతరం పాకిస్థాన్ నుంచి యూఏఈకి వెళ్లినట్లు ప్రచారం ఉంది. పాకిస్థాన్‌లో టిక్‌టాక్‌కు ఆదరణ పెరిగిన తర్వాత భట్టీ సోషల్ మీడియా స్టార్‌గా ఎదిగాడు. ‘333’ పేరుతో గుర్తింపు పొందుతూ మతపరమైన, జాతీయవాద, వివాదాస్పద అంశాలపై పోస్టులు చేస్తూ భారీగా ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. భారత జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తనకు స్నేహితుడని కూడా గతంలో చెప్పుకున్నాడు. అయితే పహల్గాం ఉగ్రదాడి తర్వాత బిష్ణోయ్ పాక్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో వీరి సంబంధాలు దెబ్బతిన్నట్లు సమాచారం.

**ఉగ్రకుట్రల ఆరోపణలు**

ప్రముఖ నటుడు, బీజేపీ నేత మిథున్ చక్రవర్తి సహా పలువురు వ్యక్తులను భట్టీ బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2024లో పంజాబ్‌లోని జలంధర్‌లో ఇన్‌ఫ్లూయెన్సర్ రోజర్ సంధు నివాసం వద్ద జరిగిన గ్రనేడ్ దాడి వెనుక భట్టీ హస్తం ఉందనే ఆరోపణలపై దర్యాప్తు జరిగింది. అతడికి పాకిస్థాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)తో సంబంధాలు ఉన్నాయని భారత దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి.

భారత్‌లో యువతను తీవ్రవాద భావజాలం వైపు ఆకర్షించి నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ప్రయత్నించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో అతడి నెట్‌వర్క్‌కు సంబంధించి కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

**253 అరెస్టులు.. భట్టీపై పాక్ స్పందన**

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు దేశవ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్లలో 14 రాష్ట్రాల్లో మొత్తం 253 మందిని అరెస్ట్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. వీరిలో తెలంగాణకు చెందిన ఇద్దరు ఉన్నట్లు సమాచారం. మరోవైపు మహారాష్ట్ర ఏటీఎస్ కూడా భట్టీతో సంబంధాలున్నాయనే అనుమానంతో 112 మందిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. భట్టీ నెట్‌వర్క్‌ను భద్రతా బలగాలు నిర్వీర్యం చేశాయని ప్రకటించినట్లు సమాచారం. అయితే భట్టీ నెట్‌వర్క్‌కు ఐఎస్ఐతో సంబంధాలున్నాయన్న ఆరోపణలను పాకిస్థాన్ తిరస్కరించింది. భట్టీ తాజాగా చేసిన ‘భారత్‌లో మా వాళు 3,000 మంది ఉన్నారు’ అనే వ్యాఖ్యలు నిజమా? లేక భయాందోళనలు సృష్టించేందుకు చేసిన ప్రచారమా? అనే అంశంపై దర్యాప్తు సంస్థలు మరింత లోతుగా పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో వెలుగులోకి వస్తున్న లింకుల నేపథ్యంలో భద్రతా సంస్థల దర్యాప్తు కీలకంగా మారింది.

# కాశ్మీర్ అసలు చరిత్ర తెలీదా? సైనికుల త్యాగాలపై జెన్-జీ పర్యాటకురాలి రచ్చ!

ఈనాటి జెన్-జీ (+వఅ్గ-) తరానికి కాశ్మీర్ అనగానే ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటకం, సోషల్ మీడియా రీల్స్ మాత్రమే గుర్తుకొస్తున్నాయి. గతంలో కాశ్మీర్ ఎదుర్కొన్న తీవ్రమైన అభద్రత, హింస మరియు అక్కడి ఆర్మీ జవాన్లు చేసిన త్యాగాల గురించి నేటి తరం యువతకు సరైన అవగాహన ఉండటం లేదు. తాజాగా ఒక జెన్-జీ పర్యాటకురాలు సెక్యూరిటీ చెక్‌పోస్ట్ వద్ద ఆర్మీ జవాన్లతో ప్రవర్తించిన తీరు, వారిని తీవ్రంగా నిందించిన ఘటన దీనికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది.

**వైరల్ వీడియో.. ఆర్మీతో జెన్-జీ రచ్చ :**

కాశ్మీర్ టూర్‌కు వెళ్లిన ఒక జెన్-జీ అమ్మాయికి సెక్యూరిటీ కారణాల వల్ల ఆర్మీ అధికారులు రోడ్డు బ్లాక్ చేయడం నచ్చలేదు. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ఆ పర్యాటకురాలు “నేను జెన్-జీని, నా ట్రావెల్ ను అడ్డుకుంటారా? మీ జీతాలు మేము కట్టే పన్నుల నుంచే వస్తున్నాయి, మీ వల్లే కాశ్మీరీలు ఇబ్బంది పడుతున్నారు” అంటూ ఆర్మీ పర్సనల్‌పై విరుచుకుపడింది. ఆ సమయంలో తీసిన వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా తీవ్ర వివాదాస్పదంగా మారింది.

**భద్రత ముఖ్యం కానీ ఫోటోలు కాదు:**

ఆర్మీ జవాన్లు ఒక రహదారిని బ్లాక్ చేశారంటే అక్కడ ఏదో ఒక తీవ్రమైన భద్రతా కారణం ఉండే ఉంటుంది. ఇక ఏదో సరదాగా వెకేషన్‌కు వెళ్లే పర్యాటకులకు అక్కడి అసలు పరిస్థితులు, ప్రాణాపాయాల గురించి ఏం తెలుస్తుంది? వేల అడుగుల ఎత్తులో రాత్రింబవళ్లు పహారా కాస్తూ, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సరిహద్దులను కాపాడే సైనికుల కష్టాన్ని గుర్తించకుండా, కేవలం వ్యక్తిగత అసౌకర్యం కోసం వారిని అసహ్యించుకోవడం ఎంతవరకు సమంజసం?

**90ల నాటి కాశ్మీర్ పరిస్థితి తెలుసా?:**

80లు, 90ల కాలంలో పుట్టిన వారికి ఆనాటి కాశ్మీర్ భయానక వాతావరణం బాగా తెలుసు. నిత్యం కాల్పులు, ఉగ్రవాద దాడులు, స్థానికుల అభద్రతా భావంతో ఆ ప్రాంతం ఎంతగా నలిగిపోయిందో వర్ణించలేం. మన సైన్యం రాత్రింబవళ్లు చేసిన అసాధారణ త్యాగాలు, పోరాటాల వల్లే ఈరోజు కాశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు ఏర్పడి, సురక్షితంగా టూరిజం ఎంజాయ్ చేసే స్థాయికి వచ్చింది. ఇక చదువుకుంటున్న నేటి యువత ఈ చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సామాజిక బాధ్యత విస్మరిస్తున్నారా?:**

ఏదైనా విఐపి కన్వాయ్ వెళ్తుంటే గంటల తరబడి ట్రాఫిక్‌లో ఆగిపోతే ప్రశ్నించడంలో ఒక అర్థం ఉంది. కానీ, దేశ రక్షణ బాధ్యతను మోస్తున్న ఆర్మీ అధికారులతో వాదనకు దిగడం అహంకారానికి, అవగాహనా రాహిత్యానికి నిదర్శనం. ప్రతికూల వాతావరణంలో, గడ్డకట్టే చలిలో దేశ సరిహద్దుల్లో కాపలా కాసే ఆర్మీ గౌరవాన్ని నిలబెట్టడం ప్రతి పౌరుడి బాధ్యత. ఈరోజు మనం హాయిగా ఇలా పర్యటించగలుగుతున్నామంటే దాని వెనుక వేలాది మంది సైనికుల రక్తం, చెమట ఉన్నాయి. ఇక కేవలం రీల్స్, ఫోటోల కోసమే కాకుండా, కాశ్మీర్ సాధించిన శాంతి వెనుక ఉన్న మన సైనికుల త్యాగాలను జెన్-జీ తరం గుర్తించి, గౌరవించడం నేర్చుకోవాలి కొందరి అభిప్రాయం.

# హాట్ టాపిక్ : మోడీ వారసుడిని రెడీ చేస్తున్నారా ?



ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీలో అత్యంత శక్తివంతమైన నాయకుడు. ఆయనకు ప్రజలలో ఉండే ఆకర్షణ అలాగే ఆయన వ్యూహాలు ఆయన చేసే ప్రసంగాలు సొంత కుటుంబం లేకపోవడం అవినీతికి వ్యతిరేకం అన్న ఇమేజ్ ఇవన్నీ ఆయనకు రక్షణ కవచాలు. ఏ ప్రధానికీ లేనంత ఆదరణ ఆయనకు దేశ ప్రజలు ఇచ్చారు. ఒక విధంగా చెప్పాలీ అంటే తమ ఇంట్లో మనిషిగా ఆయనను భావించారు. మోడీ సైతం దేశం కోసమే తన జీవితం అంకితం అని చెబుతూ వచ్చారు. ఆ విధంగా 2013 లో ఎన్డీయే తరఫున ప్రధాని అభ్యర్థిగా దేశ రాజకీయాల్లోకి వచ్చిన నరేంద్ర మోడీ ఈ రోజు వరకూ తిరుగులేని నేతగా కొనసాగుతూనే ఉన్నారు. అయితే మోడీ ప్రభ తగ్గిపోతోంది అని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. 2024 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ రాకపోవడమే అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు.

**ఇటీవల సంఘటనలతో :**

ఇక ఇటీవల విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు జంతర్ మంతర్ వద్ద రోజుల తరబడి జెన్ జీ యువత భారీ నిరసనలు దాని ఫలితంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం ఇవన్నీ కూడా బీజేపీకి ప్రత్యేకించి మోడీకి ఇబ్బందిగా మారాయని అంటున్నారు. ఆ తరువాత కూడా యువత కేంద్ర పాలకుల పట్ల తన అసహనాన్ని అలా కొనసాగిస్తూనే ఉండడం కూడా ఎన్డీయే ప్రభుత్వానికి రెడ్ సిగ్నల్స్ కిందనే లెక్క అని అంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో జరిగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో కాంగ్రెస్ పై చేయి సాధించినట్లుగా అనిపించింది. బీజేపీ ఆమోదించుకోవాలనుకున్న బిల్లులు డీ లిమిటేషన్, మహిళా బిల్లు లాంటివి వెనక్కి వెళ్ళాయి. ఇది కూడా బీజేపీకి గతంలో ఎన్నడూ జరగని చూడని అనుభవమే అని అంటున్నారు.

**రాహుల్ సంచలన వ్యాఖ్యలు :**

ఇదిలా ఉంటే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మోడీని గురించి సంచలన వ్యాఖ్యలు చేసినట్లుగా ప్రచారం అవుతోంది. కాంగ్రెస్ అత్యున్నత విధాయక మండలి సీడబ్ల్యూసీలో రాహుల్ గాంధీ మోడీ రాజకీయం ముగింపునకు వచ్చింది అని వ్యాఖ్యానించారు అని అంటున్నారు. మోడీకి దేశ ప్రజలు ఇచ్చిన సమయం అయిపోయింది అని కూడా రాహుల్ అన్నారు. ఆయన పరిపాలన కూడా దాదాపుగా చివరి దశకు చేరింది అని రాహుల్ వ్యాఖ్యానించడం విశేషం. మోడీ నిర్ణయాల మీద ఎన్డీయే పాలన పట్ల జనంలో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత ఉందని రాహుల్ అన్నట్లుగా చెబుతున్నారు. సరిగ్గా ఇదే సమయం అని కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరించాలని ఆయన పార్టీ నేతలకు సూచించారు అని అంటున్నారు.

**మోడీ వారసుడి ఎంపిక :**

మోడీకి వారసుడిని వెతికే పనిలో బీజేపీ నాయకత్వం నిమగ్నమైందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో వ్యాఖ్యానించారని చెబుతున్నారు. ప్రధాని మోదీ స్థానంలో మరొకరిని ఎంపిక చేసే ప్రక్రియ లేదా చర్చలు బీజేపీలో తెర వెనుక జోరుగా జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మరి రాహుల్ గాంధీ చేసిన ఆ వ్యాఖ్యల వెనక ఆయనకు ఉన్న సమాచారం ఏమిటి అన్న చర్చ కూడా సాగుతోంది. మోడీ ఈ రోజుకు ప్రధానిగా ఉన్నారు. ఆయన చేతిలో ఇంకా మూడేళ్ల దాకా అధికారం ఉంది. 2029లో ఒక వేళ బీజేపీ ఓడితే అపుడు మోడీ పక్కకు తప్పుకుంటారు అన్నది అయితే ఉంది. అలా కాకుండా ఇంతలోనే మోడీని మార్చి బీజేపీ ఏమి చేస్తుంది అన్నది కూడా మరో చర్చ. ఏది ఏమైనా రాహుల్ గాంధీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో చేశారు అని ప్రచారంలో ఉన్న ఈ వ్యాఖ్యలు అయితే రాజకీయంగా సంచలనం రేపుతున్నాయి.

# రూ.20ల లంచం కేసు.. 30 ఏండ్లకు తుది తీర్పు



భారత న్యాయ వ్యవస్థలో న్యాయం జరగడానికి ఆలస్యం కావచ్చు కానీ, న్యాయం మాత్రం పక్కాగా జరుగుతుందని అంటారు. అయితే న్యాయం జరగడానికి రెండు మూడు ఏళ్లు లేదా అయిదు ఏళ్ళు అయితే పర్వాలేదు కానీ ఒక కేసులో నిందితులకు ఏకంగా 30 ఏళ్లకు న్యాయం జరగడం తో మరోసారి భారత న్యాయ వ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. గుజరాత్ లో జరిగిన ఈ సంఘటన ప్రస్తుతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 1996లో నమోదు అయిన ఒక అవినీతి ఆరోపణ కేసు 2026 లో అంటే ఏకంగా 30 ఏళ్ల తర్వాత పరిష్కారం అయింది. ఇన్నాళ్లు ఆ కేసు ఎన్నో మలుపులు తిరిగింది, కేసుకు సంబంధించిన వారు, కేసు ఆరంభంలో ఉన్న వారు చాలా మంది ఇప్పుడు కనీసం లేచి నిల్చునే పరిస్థితి లేదు. ఇన్నాళ్ల తర్వాత అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఇద్దరు నిర్దోషులు అని కోర్ట్ సంచలన తీర్పు ఇచ్చింది.

**గుజరాత్ అవినీతి కేసులో తీర్పు...**

ఈ అవినీతి కేసు పూర్తి వివరాల్లోకి వెళ్తే... గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా బెచారి గ్రామ మంచాయతీ కార్యాలయంలో ఒక విద్యార్థి ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం అప్లికేషన్ పెట్టుకున్నాడు. ఆ సర్టిఫికెట్ ఇవ్వడానికి క్లర్క్ రూ.120లు లంచం డిమాండ్ చేసినట్లుగా విద్యార్థి ఆరోపించాడు. ఆ రూ.120ల్లో క్లర్క్‌కి రూ.100లు, ప్యూన్ కి రూ20లు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారట. ఈ విషయాన్ని సదరు విద్యార్థి ఏసీబీ వారికి తెలియజేశాడు. అవినీతి నిరోధక శాఖ వారు వల వేసి విద్యార్థి డబ్బులు ఇస్తున్న సమయంలో క్లర్క్, ప్యూన్ ను పట్టుకున్నారు. ఆ సమయంలో ఏసీబీ వారికి ప్యూన్ వద్ద కేవలం రూ.20 లు మాత్రమే లభించాయి. క్లర్క్ కి డబ్బులు ఇచ్చినట్లుగా ఆధారాలు లభించలేదు, అంతే కాకుండా ఆ క్లర్క్ వద్ద డబ్బులు కూడా ఏసీబీ వారు పట్టుకోలేకపోయారు. అయినా కూడా అవినీతి ఆరోపణల కేసులో క్లర్క్, ప్యూన్‌లపై కేసు నమోదు చేయడం జరిగింది.

**సుప్రీం కోర్ట్ విచారణ తర్వాత...**

సుదీర్ఘ విచారణ కొనసాగిన తర్వాత కేసును కోర్ట్‌కు తీసుకు వెళ్లారు. కింది స్థాయి కోర్ట్ అవినీతి జరిగిందని తీర్పు ఇవ్వడంతో పాటు, ఆ ఇద్దరిపై చర్యలకు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే క్లర్క్, ప్యూజ్ న్యాయపోరాటం చేయడం మొదలు పెట్టారు. గత కొంత కాలంగా సుప్రీం కోర్ట్‌లో ఈ కేసు విచారణ కొనసాగుతూ వస్తోంది. ఎట్టకేలకు సుప్రీం కోర్ట్ ధర్మాసనం ఈ కేసులో తుది తీర్పు వెలువరించి ఆ ఇద్దరు ఉద్యోగుల తరఫున తీర్పు ఇచ్చింది. 2015 లో గుజరాత్ హైకోర్ట్ ఇచ్చిన కన్విక్షన్ తీర్పున కొట్టి వేస్తూ సుప్రీం కోర్ట్ అవినీతి జరగలేదు అని తీర్పు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. 30 ఏళ్లుగా వారు అవినీతిపరులు అంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వారు అవినీతిపరులు కారు అంటూ తీర్పు రావడం, అది కూడా సుప్రీం కోర్ట్ ఆ తీర్పును ఇవ్వడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.

**అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు..**

క్లర్క్‌ను విచారించిన సమయంలో తనకు ఆ విద్యార్థి ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇచ్చిన సందర్భంగా సంతోషంగా ఇచ్చినట్లుగా చెప్పాడు. అంతే కాకుండా ఆ విద్యార్థి సైతం విచారణ సమయంలో తాను రూ.20లు మాత్రమే ఇచ్చినట్లు చెప్పుకొచ్చాడు. క్లర్క్ ఈ సందర్భంగా డబ్బులు తీసుకున్నట్లు ఎలాంటి ఆధారం లేదు. పైగా అతడి వద్ద డబ్బు నోట్లు కూడా స్వాధీనం చేసుకోలేదు. విద్యార్థి ఇచ్చిన వాంగ్మూలం లో తప్పులు ఉన్నాయి. వేరు వేరు సందర్భాల్లో వేరు వేరుగా అతడు తన మాట మార్చడంను బట్టి చూస్తూ ఉంటే క్లర్క్, ప్యూన్ లపై అతడు ఉద్దేశపూర్వకంగా అవినీతి ఆరోపణలు చేశాడా అనే అనుమానాలు సైతం కలుగక మానవు. అందుకే సుప్రీం కోర్ట్ వారిద్దరినీ నిర్ధోషులుగా ప్రకటించడం జరిగింది. అయితే ఈ 30 ఏళ్లలో ఆ ఇద్దరు పడిన మానసిక నరక యాతనకు పరిష్కారం ఏంటీ అనేది మాత్రం కోర్ట్ చెప్పలేదు. ఇలా ఎన్నో కేసుల్లో చిక్కుకున్న నిర్దోషులు తమకు ఏదో ఒక రోజు న్యాయం జరుగుతుందని ఏళ్లకు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.

# టేకాఫ్ కాదు సార్.. తలరాతతో ఆడుకున్న గాల్లో ఆటా: జర్మనీ రన్‌వేపై వియత్నాం విమానం సర్కస్




సాధారణంగా విమానం ఎక్కితే “హాయిగా గాల్లో తేలిపోదాం” అని కలలు కంటారు. కానీ ఆగస్టు 15న మ్యూనిచ్ నుంచి హనోయ్ బయలుదేరిన ‘వియత్నాం ఎయిర్‌లైన్స్’ బోయింగ్ 787-9 (వీఎన్34) విమానం ఎక్కిన ప్రయాణికులకు మాత్రం ఉచితంగా బిపి చెకప్, పైసా ఖర్చు లేని ‘లైవ్ థ్రిల్లర్ సినిమా’ అనుభవం దక్కింది. విమానం రన్‌వేపై పరుగులు తీయడం మొదలుపెట్టిందో లేదో రెండు సెకన్ల పాటు వేగం ఆగిపోయింది. “అబ్బే.. ఇంజిన్‌కు కాస్త ఆయాసం వచ్చిందేమోలే” అనుకునేలోపే మళ్ళీ వేగం పుంజుకుని బీ1 స్పీడ్ అందుకుంది. “హమ్మయ్య.. బయటపడ్డాం” అని ప్రయాణికులు ఊపిరి పీల్చుకునే లోపే విమానం మళ్ళీ బ్రేక్ వేసినంత పని చేసింది. టేకాఫ్ అవ్వాల్సిన సమయంలో విమానం “వెళ్లాలో వద్దో” అని సందేహించడం చూసి రన్‌వే కూడా కాసేపు కంగారుపడి ఉంటుంది. ఇక టేకాఫ్ ఆపడానికి వీల్లేని పరిస్థితి. రన్‌వే చివర కేవలం 91 మీటర్లు మాత్రమే మిగిలి ఉంది. అంటే దాదాపు ‘క్రికెట్ పిచ్’ పొడవుకంటే కాస్త ఎక్కువ అన్నమాట.. సరిగ్గా ఆ గ్యాప్‌లో పైలట్ విమానం ముక్కును పైకి లేపారు. ఎంత గట్టిగా లేపారంటే.. విమానం తోక వెనుక భాగం రన్‌వేను నలిపేస్తూ ‘టెయిల్ స్ట్రైక్’ కొట్టింది. దెబ్బకు నాలుగు టైర్లు “టచ్‌లో ఉండటం మా వల్ల కాదు బాబోయ్” అంటూ టప్ టప్ మని పేలిపోయాయి.

అక్కడితో కథ ముగియలేదు. గాల్లోకి లేవగానే అలారమ్‌ల మోత.. “టైర్లలో గాలి లేదు.. తోక విరిగింది” అని విమానం మొత్తుకోవడంతో పైలట్లు రివర్స్ గేర్ వేశారు. బరువు తగ్గించుకోడానికి దాదాపు 9,000 అడుగుల ఎత్తులో టన్నుల కొద్దీ ఇంధనాన్ని గాల్లోకి వదిలేశారు. ఆ తర్వాత మ్యూనిచ్ విమానాశ్రయం చుట్టూ గంటకు పైగా విమానం చక్కర్లు కొడుతుంటే ప్రయాణికులు లోపల “దేవుడా.. ల్యాండ్ అయితే చాలు” అని జపాలు చేసుకున్నారు. విమానం లోపల ఎయిర్ హోస్టెస్‌లు “అందరూ తలలు వంచి ‘బ్రేస్ పొజిషన్’లో కూర్చోండి” అని చెప్పడంతో ప్రయాణికులకు అసలు రోలర్‌కోస్టర్ రైడ్ ఏంటో అర్థమైంది. చివరికి 271 మంది ప్రయాణికులు.. 16 మంది సిబ్బంది ప్రాణాలతో సురక్షితంగా కిందకు దిగారు. విమానానికి మాత్రం గట్టిగా నష్టం వాటిల్లింది. టేకాఫ్‌లో రెండుసార్లు బ్రేకులు, నాలుగు టైర్లు ఖాళీ, తోకకు దెబ్బ.. అయినా కూడా సురక్షితంగా ల్యాండ్ అయ్యారంటే అది పైలట్ల నైపుణ్యం అనాలా? లేక ఆ ప్రయాణికుల అదృష్టం అనాలా? ఏది ఏమైనా “మళ్ళీ ఎప్పుడు విమానం ఎక్కుతారు?” అని ఆ 271 మందిని అడిగితే.. బహుశా నడుచుకుంటూ వెళ్ళడమే నయమని సమాధానమిస్తారేమో..

## గట్టిగా.. 'నో' చెప్పాలి!

భారత ఆర్థిక వ్యవస్థపై అత్యంత తీవ్ర ప్రభావం చూపగల అమెరికా తాజా ఆరోపణ ఒకటి ఆగస్టు 14న వెలుగులోకి వచ్చింది. శ్వేతసౌధం వాణిజ్య, తయారీ విధాన కార్యాలయం విడుదల చేసిన 'ది గ్రేట్ ట్రాన్‌షిప్‌మెంట్ స్కామ్' నివేదిక, చైనా సుంకాల ఎగవేతకు సహకరిస్తున్న 40కి పైగా దేశాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపింది. కెనడా, యూరోపియన్ యూనియన్, ఇజ్రాయెల్, జపాన్, మెక్సికో, దక్షిణ కొరియా, తైవాన్‌లతోపాటు భారత్‌ను 'టైర్-1: డైవర్సిఫైడ్ స్కేల్ లీడర్స్' విభాగంలో చేర్చారు. అంటే, చైనా వస్తువులను స్వల్ప మార్పులు చేసి, తక్కువ సుంకాలతో అమెరికాకు తిరిగి ఎగుమతి చేస్తున్నారన్నది ఆరోపణ. 2025లో మెక్సికో, భారత్, వియత్నాం మీదుగా దాదాపు 67 బిలియన్ డాలర్ల విలువైన చైనా వస్తువులు అమెరికాకు తరలివెళ్లాయని నివేదిక అంచనా వేసింది. భారత్‌లోని పుణె- గుజరాత్- చెన్నై పారిశ్రామిక బెల్ట్‌ను పంపులు, కంప్రెసర్ల కేంద్రంగా ప్రత్యేకంగా పేర్కొంటూ, దీన్ని అమెరికాలోని సిన్సినాటి, డేటన్, కొలంబస్ నగరాల్లోని పరిశ్రమలతో పోల్చడం గమనార్హం. అయితే, భారత ప్రభుత్వంగానీ, స్థానిక ఎగుమతిదారులుగానీ ఉద్దేశపూర్వకంగా సుంకాల ఎగవేతకు పాల్పడుతున్నారని నివేదిక ఎక్కడా స్పష్టంగా చెప్పలేదని, భారీ, వైవిధ్యభరిత వాణిజ్య స్థావరాలున్న దేశాల్లో చట్టబద్ధమైన వాణిజ్యం నుంచి ట్రాన్‌షిప్‌మెంట్ ముప్పును వేరుచేయడం కష్టమని కూడా నివేదిక అంగీకరించింది. చైనా దిగుమతులు భారత తయారీ రంగానికి కీలకమన్నది బహిరంగ రహస్యమే. అయితే, ఈ దిగుమతుల స్వభావం క్రమంగా మారుతోంది. పూర్తయిన ఉత్పత్తులను దిగుమతి చేసుకుని, స్వల్ప మార్పులు చేసి విక్రయించే విధానంనుంచి భారత్ నెమ్మదిగా బయటపడుతోంది. బదులుగా, చైనానుంచి భారత దిగుమతుల్లో మధ్యంతర వస్తువుల వాటా స్థిరంగా పెరుగుతోంది. అంటే, పలు రంగాల్లో అసెంబ్లింగ్, తయారీని భారత్ స్వయంగా చేస్తూ, అవసరమైన విడిభాగాల కోసం మాత్రమే చైనా, ఇతర దేశాలపై ఆధారపడుతోంది. ఇది 'మేక్ ఇన్ ఇండియా' పూర్తిస్థాయి తయారీ దిశగా ఒక ముఖ్యమైన అడుగు.

చైనా సుంకాల ఎగవేతపై తన మదింపు ఆధారంగా అమెరికా ఇంకా శిక్షాత్మక చర్యలను ప్రకటించలేదు. అయితే భవిష్యత్తులో అలాంటి అవకాశం లేదని చెప్పలేం. ఒకవేళ అలాంటి చర్యలు తీసుకుంటే, ఈ విషయంలో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గకూడదు. ప్రభుత్వమే స్వయంగా అంగీకరించినట్టు, ప్రస్తుతం చైనా దిగుమతులు 'మేక్ ఇన్ ఇండియా' కథలో ఒక ముఖ్యమైన భాగం. భారత్ అమెరికా ఒత్తిడికి లొంగిపోతుందన్న భయానికి గత చరిత్రే బలమైన నిదర్శనం. తన మొదటి అధ్యక్ష పదవీకాలంలో, హైఎండ్ మోటార్‌సైకిళ్లపై భారత సుంకాలను ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. 2018లో భారత్ ఈ సుంకాలను 60-75 శాతం నుంచి 50 శాతానికి తగ్గించింది. వాణిజ్య ఒప్పంద చర్చలు ప్రారంభమయ్యేముందే 2025 ఫిబ్రవరిలో వాటిని మరింత తగ్గించి 40 శాతానికి చేర్చింది. అలాగే, రొయ్యల మేత, దాని విడిభాగాలపై దిగుమతి సుంకాలను 2024 ఫిబ్రవరి బడ్జెట్‌లో తగ్గించింది. ఇది అమెరికా చేసిన కీలక డిమాండ్లలో ఒకటి. 2025 ఆగస్టులో విధించిన 50 శాతం శిక్షాత్మక సుంకాల ఒత్తిడి, రష్యా చమురుపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భారత్‌ను నెట్టివేసింది. 2026 జనవరి నాటికి భారత చమురు దిగుమతుల్లో రష్యా వాటా 20 శాతంకంటే దిగువకు పడిపోయింది. ఆరు నెలల క్రితం 50 శాతం సుంకాలు విధించినప్పుడు ఉన్న దానికి దాదాపు సగానికి. 2019లో వెనెజువెలా చమురుతోనూ ఇదే జరిగింది. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా తాత్కాలిక సడలింపు కారణంగానే భారత్ మళ్లీ రష్యా చమురువైపు మళ్లుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవలే ఈ-కామర్స్ ఇన్వెంటరీ మోడల్‌లో ఎఫ్‌డీఐని అనుమతించడం.. అమెజాన్ దశాబ్దంపాటు లాబీయింగ్ చేసిన అంశమే.

ఈ నేపథ్యంలో, 2025 ఆగస్టులో అమెరికా విధించిన సుంకాల పరిణామాలను గుర్తుచేసుకోవడం అవసరం. మొదట ఏప్రిల్ 5న సార్వత్రిక 10 శాతం సుంకం విధించగా, ఆగస్టు 7న అది 25 శాతానికి, ఆగస్టు 27న రష్యా చమురు కొనుగోళ్లకు శిక్షగా అదనంగా మరో 25 శాతంతో మొత్తం 50 శాతానికి చేరింది. ఫలితంగా, భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడింది. ఆగస్టులో అమెరికాకు ఎగుమతులు 16.3 శాతం పడిపోగా, ఇది 2025లో నమోదైన అత్యంత తీవ్రమైన నెలవారీ క్షీణతగా గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ పేర్కొంది. అయితే, ఈ సుంకాల విధింపులో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను జీటీఆర్ఐ ఎత్తిచూపింది. 2024లో చైనా 62.6 బిలియన్ డాలర్ల విలువైన రష్యా చమురును దిగుమతి చేసుకుంది, ఇది భారత్ దిగుమతి చేసుకున్న 52.7 బిలియన్ డాలర్లకంటే ఎక్కువ. అయినప్పటికీ బీజింగ్‌పై ఎలాంటి శిక్షాత్మక సుంకాలు లేవు. యూరోపియన్ యూనియన్ 2024లో రష్యానుంచి 39.1 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకున్నా, దాన్నీ అమెరికా విస్మరించింది. ఈ అసమాన వైఖరి, అమెరికా వ్యూహం కేవలం వాణిజ్య న్యాయం కోసం కాదని, భారత్‌పై నిర్దిష్ట రాజకీయ, వ్యూహాత్మక ఒత్తిడి పెంచడానికేనని స్పష్టం.

అమెరికా అపారమైన ఒత్తిడి ప్రయోగించగలదు. కాబట్టి భారత్ కొన్ని రాయితీలు ఇవ్వడం అర్థం చేసుకోదగినదే. కానీ అదే భారత్‌పై మరిన్ని డిమాండ్లు చేసేందుకు అమెరికాకు ధైర్యాన్నిచ్చింది. ప్రతిసారీ ఒత్తిడికి తలొగ్గి రాయితీలిస్తూ పోతే, అది మరింత డిమాండ్లకు ఆహ్వానం మాత్రమే. మోటార్‌సైకిల్ సుంకాల నుంచి రొయ్యల మేత సుంకాల వరకు, రష్యా చమురు నుంచి ఈ-కామర్స్ ఎఫ్‌డీఐ వరకు -ప్రతి రంగంలోనూ ఇదే సరళి పునరావృతమవుతోంది. ఇప్పుడు ట్రాన్‌షిప్‌మెంట్ ఆరోపణల రూపంలో మరో కొత్త ఒత్తిడి వచ్చిపడుతోంది. దీన్ని ఎదుర్కోవడంలో భారత్ మరింత దృఢంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. చైనా దిగుమతులపై ఆధారపడటం క్రమంగా తగ్గించుకుంటూ, దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచుకోవడం దీర్ఘకాలిక పరిష్కారమే అయినా, అది వేగంగా సాధ్యం కాదు. ఈలోగా, అమెరికా చేసే ప్రతి డిమాండ్‌కూ వెంటనే తలొగ్గకుండా, భారత జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, దౌత్యపరంగా దృఢంగా బేరమాడే వ్యూహాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైంది. వాణిజ్య భాగస్వామ్యం పరస్పర గౌరవం, న్యాయబద్ధమైన నిబంధనలపై ఆధారపడాలి తప్ప, ఏకపక్ష ఒత్తిడిపై కాదు. భారత్ ఇప్పుడు వెనక్కి తగ్గే వైఖరిని విడనాడి, గట్టిగా ఎదురుదెబ్బ తీసేందుకు సన్నద్ధం కావాలి!

### పనికొచ్చే పలుకు




## కాలానుగుణంగా మారక తప్పదు!

పరిస్థితులు వేగంగా మారుతున్నప్పుడు పాత పద్ధతులు పట్టుకు వేలాడితే.. ప్రమాదకరం అంటున్నాడు మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్ పీటర్ డ్రక్కర్. సవాళ్లను ఎదుర్కొంటూ కొత్త వ్యూహాలతో ఎలా ముందడుగు వేయాలో ఆలోచించాలట. వ్యాపార రంగమైనా, వ్యక్తిగత జీవితమైనా సంక్షోభాలు ఎదురైనప్పుడు కొత్త వ్యూహాలతో ముందుకెళ్లాలన్నది పీటర్ డ్రక్కర్ ఎప్పుడో ఎప్పుడో చెప్పిన ఫిలాసఫీ. అంటే -కాలానుగుణంగా మనల్ని మనం మార్చుకోకుంటే వెనకబడతామన్నది ఆయన హెచ్చరిక. "సంక్షోభ కాలంలో ఎదురయ్యే అతి పెద్ద ప్రమాదం సంక్షోభం కాదు... నిన్నటి ఆలోచనలతో ముందడుగు వేయడమే" అంటాడు పీటర్ డ్రక్కర్. ఆస్ట్రియన్-అమెరికన్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, విద్యావేత్త అయిన పీటర్ డ్రక్కర్ మాటలు.. జెన్ జీ వంటబట్టించుకోవాలి. మార్పు అనివార్యమైనప్పుడు దానిని ఎదిరించడం కంటే, కొత్త ఆలోచనలతో స్పందించడమే విజేతల లక్షణమన్నది ఆయన విశ్వాసం. మనుషులు ఎప్పుడూ తమకు అలవాటైన పద్ధతుల్లోనే ప్రయాణించడానికి ఇష్టపడతారు. ముఖ్యంగా కష్టకాలంలో తెలిసిన దారిలోనే వెళ్లడం సురక్షితమని భావిస్తారు. కానీ, వేగంగా మారుతున్న కాలంలో పాత పద్ధతులను నమ్ముకుంటే నష్టపోక తప్పదు. 'నిన్నటి లాజిక్' అంటే కాలం చెల్లిన ఆలోచనలు, పాత అలవాట్లు గతంలో అద్భుతమైన ఫలితాలు ఇచ్చి ఉండొచ్చు. కానీ నేటి సరికొత్త సమస్యలను అవి పరిష్కరించలేవు. స్థిరమైన వృద్ధి సాధించాలంటే పాత ఆలోచనలు పక్కనపెట్టి, కొత్త ప్రయోగాలకు సన్నద్ధం కావాలి. సవాళ్లు అనేవి జీవితంలో ఎదురవుతూనే ఉంటాయి. వాటిని చూసి భయపడకుండా మన ఆలోచనా సరళిని మార్చుకుంటే, ఆ సవాళ్లనే అద్భుతమైన అవకాశాలుగా మలుచుకోవచ్చు. ఆర్థిక ప్రణాళికలు, కెరీర్ ఎదుగుదల, వ్యక్తిగత బంధాల బలోపేతం... ఇలా ఏ రంగంలోనైనా కొత్త సమాచారాన్ని స్వీకరిస్తూ తదనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలి. నిలకడైన ప్రయత్నం, స్పష్టమైన ప్రాధాన్యతలు ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. సో, పాత లాజిక్‌తో కొత్త సవాళ్లను ఎదుర్కోవాలనుకోవడమే అతిపెద్ద ప్రమాదం. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆలోచనలను, వ్యూహాలను నిరంతరం సరిదిద్దుకోవడమే నిజమైన తెలివి. సవాళ్లను భయపెట్టే శత్రువులుగా కాకుండా, ఎదగడానికి వచ్చిన అవకాశాలుగా చూడండి. నిన్నటి విజయాలపై ఆధారపడకుండా, రేపటి కోసం సిద్ధం కావడమే విజేతల లక్షణం. మార్పును స్వీకరించే ధైర్యం ఉన్నవారికే భవిష్యత్తు స్వాగతం పలుకుతుంది.

ఎవరీ పీటర్ డ్రక్కర్?

ఆధునిక మేనేజ్‌మెంట్ సిద్ధాంతకర్తగా ప్రపంచవ్యాప్తంగా పీటర్ డ్రక్కర్ గుర్తింపు పొందారు. వ్యాపార నిర్వహణను ప్రత్యేక శాస్త్రంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదే. ఆయన సేవలను గుర్తిస్తూ అమెరికా ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' (2002)తో సత్కరించింది. దీనితోపాటు హెన్రీ లారెన్స్ గాంట్ మెడల్, ఆస్ట్రియన్ క్రాస్ ఆఫ్ హానర్ (1991) వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. పీటర్ డ్రక్కర్ రాసిన పుస్తకాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా మేనేజర్లు, సీఈఓలకు మార్గదర్శకాలు. వాటిలో అత్యంత ప్రజాదరణ పొందినవి.

- ది ఎఫెక్టివ్ ఎగ్జిక్యూటివ్ (1967)
- మేనేజ్‌మెంట్: టాస్క్స్, రెస్పాన్సిబిలిటీస్, ప్రాక్టీసెస్ (1973)
- ఇన్నోవేషన్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ (1985)
- మేనేజింగ్ వన్‌సెల్ఫ్ (1999)
- ది ఎస్సెన్షియల్ డ్రక్కర్ (2001)

## వికసిత భారతానికి వీరే బలం!





భారత్‌లోని దాదాపు ప్రతి నగరంలో.. దేశం మాట్లాడుకోవాల్సిన ఒక కుటుంబముంటుంది. తండ్రి ప్రతి ఏటా సకాలంలో పూర్తిగా ఆదాయపు పన్ను చెల్లిస్తాడు. తల్లి తన కూతురి ఇంజినీరింగ్ చదువు కోసం రుణం తీసుకుంటుంది. ఎప్పటికీ రాకూడదని ఆశించే అనారోగ్యం కోసం ప్రతి మార్చిలో బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ కుటుంబం ప్రభుత్వాన్ని చాలా తక్కువగానే అడుగుతుంది. ఇదే భారత మధ్యతరగతి -దేశ ఆర్థిక వ్యవస్థకు నిశ్శబ్దంగా చోదకశక్తిగా మారింది. ఇటీవల ఫ్రాన్స్‌లో మన కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ, 1995నుంచి భారత మధ్యతరగతి ఏటా సుమారు 6.3 శాతం చొప్పున విస్తరించిందని, ప్రస్తుత జనాభాలో దాదాపు 31 శాతంగా ఉందన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అంచనాల ప్రకారం, భారత వినియోగదారులు ఖర్చు చేసే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు మధ్యతరగతి, అంతకంటే ఉన్నత వర్గాల నుంచే వస్తున్నాయి. 2036నాటికి ఇది ప్రతి పది రూపాయల్లో తొమ్మిదికి పైగా చేరనుండగా, 2047 నాటికి ఈ వర్గంలో వంద కోట్లకుపైగా భారతీయులుంటారని అంచనా. మధ్యతరగతి వృద్ధి పన్ను చెల్లింపుదారుల సంఖ్యలోనూ ప్రతిబింబిస్తోంది. ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2013-14లో 5.26 కోట్లనుంచి 2024-25కి 12.13 కోట్లకు రెట్టింపైంది. రిటర్న్‌ల దాఖలు కూడా 4 కోట్లనుంచి 8.18 కోట్లకు రెట్టింపైంది. పన్ను వ్యవస్థను కేవలం కఠినతరం చేయకుండా సరళీకరించినప్పుడే ఇలాంటి ఫలితాలు వస్తాయి.

ఆరోగ్య రంగంలోనూ ఇదే కథ పునరావృతమవుతోంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యయం పెరుగుతున్న కొద్దీ, వైద్య చికిత్స కోసం కుటుంబాలు తమ సొంత జేబునుంచి చెల్లించే మొత్తం గణనీయంగా తగ్గింది. 2013-14లో 64.2 శాతం ఉన్న ఔట్-ఆఫ్-పాకెట్ వ్యయం ఇప్పుడు 39.4 శాతానికి పడిపోయింది. జాతీయ ఆరోగ్య విధానం నిర్దేశించిన 35 శాతం లక్ష్యానికి భారత్ ఇప్పుడు చేరువలో ఉంది. ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అధికారికీకరణ చెందుతున్నా, శ్రామిక మార్కెట్ మాత్రం స్థిరంగానే ఉంది. జాతీయ గణాంక కార్యాలయం ఆవర్తన శ్రామిక శక్తి సర్వే ప్రకారం, 2025లో మొత్తం నిరుద్యోగిత రేటు 3.1 శాతంగా నమోదైంది. ఇది భారత్ ఇప్పటివరకూ నమోదు చేసిన అత్యల్ప స్థాయిల్లో ఒకటి. అయితే, గ్రాడ్యుయేట్ నిరుద్యోగిత 11.2 శాతంగా ఉండటంతో, ప్రజల విద్య, నైపుణ్యాలకు తగినట్టుగా నాణ్యమైన ఉద్యోగాలను సృష్టించడమే ప్రభుత్వ తదుపరి ప్రాధాన్యతగా మారింది. ఇలాంటి కుటుంబానికి ఇప్పుడు ప్రభుత్వం నుంచి కావాల్సింది మరింత సాయం కాదు. సంక్షేమం ముఖ్యమే, పేదలకు ప్రపంచంలో ఏ దేశమూ ప్రయత్నించనంత విస్తృత స్థాయిలో భారత్ దాన్ని విస్తరించింది. కానీ మధ్యతరగతి వేరే స్థానంలో నిలుస్తుంది. దాన్ని మోసుకెళ్లమని ఎప్పుడూ కోరుకోలేదు, కేవలం ఎదిగే మార్గాన్ని సుగమం చేయమని మాత్రమే కోరుతుంది. సబ్సిడీ కొరతకు సమాధానం ఇస్తుంది, అవకాశం మహత్వాకాంక్షకు సమాధానం ఇస్తుంది -ఇటీవలి విధాన దిశ ఈ వాస్తవాన్నే గుర్తిస్తోంది.

సంక్షేమం ద్వారా ప్రజలకు సాయం చేయడం, సంపద సృష్టి ద్వారా వారికి తోడ్పడటం -ఇవి రెండు వేర్వేరు విధానాలు. సంక్షేమాన్ని ప్రభుత్వం పంపిణీ చేసే దానితో కొలుస్తారు. సంపద సృష్టిని ప్రజలు సంపాదించగలిగే దానితో కొలుస్తారు. ఇప్పటికే పేదరికం నుంచి బయటపడిన కుటుంబానికి రెండోదే ఎక్కువగా అవసరం. ఇటీవలి సంస్కరణలు నిర్ణయాత్మకంగా ఆ దిశగానే మొగ్గుచూపాయి. ఏటా రూ.12 లక్షల వరకు ఆదాయం ఇప్పుడు పన్ను రహితం, జీఎస్టీని సరళమైన శ్లాబులుగా క్రమబద్ధీకరించారు, దశాబ్దాల సంక్లిష్టత తర్వాత చివరకు 1961నాటి ఆదాయపు పన్ను చట్టాన్ని పూర్తిగా భర్తీ చేశారు. ఈ సంస్కరణలు మధ్యతరగతి కుటుంబాలు.. ముందుగా ప్రభుత్వానికి చెల్లించి, తర్వాత ప్రయోజనాలుగా తిరిగి పొందే బదులు, తాము సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగాన్ని తమవద్దే ఉంచుకునేలా చేస్తున్నాయి. మరింత మంది భారతీయులు అధికారిక ఆర్థిక వ్యవస్థలో చేరుతుండటంతో, జీఎస్టీ చెల్లింపుదారుల సంఖ్య 2017లో 66.5 లక్షల నుంచి 2026 ఏప్రిల్ నాటికి 1.64 కోట్లకు పెరిగింది. తొమ్మిదేళ్లలో దాదాపు రెండున్నర రెట్లు వృద్ధి. తక్కువ పన్నులు కుటుంబాలు తమ ఆదాయాన్ని ఎక్కువగా ఉంచుకోవడానికి సాయపడతాయి, మెరుగైన ఉద్యోగాలు ఆ ఆదాయాన్ని పెంచడానికి తోడ్పడతాయి. అందుకే ప్రభుత్వ ఇటీవలి పెట్టుబడులు మరిన్ని ఉపాధి అవకాశాల సృష్టిపైనే కేంద్రీకృతమయ్యాయి. 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది, వీటి పెట్టుబడి విలువ దాదాపు రూ.1.64 లక్షల కోట్లు (సుమారు 1,900 కోట్ల డాలర్లు). ఇండియా ఏఐ మిషన్ 45,000కు పైగా జీపీయూలతో జాతీయ కంప్యూటింగ్ సదుపాయాన్ని నిర్మించింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.13 లక్షల కోట్లకు (సుమారు 1,550 కోట్ల డాలర్లు) చేరి, భారత్ మూడో అతిపెద్ద ఎగుమతి రంగంగా నిలిచింది.

అయితే, ఈ అవకాశాలు నిజమైన శ్రేయస్సుగా మారాలంటే, తగిన నైపుణ్యాలతో యువతను సన్నద్ధం చేయడం అత్యవసరం. ఇండియా స్కిల్స్ రిపోర్ట్ 2026 ప్రకారం, ప్రస్తుతం కేవలం 56.35 శాతం గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉపాధి యోగ్యులుగా పరిగణించబడుతున్నారు. స్కిల్ ఇండియా, జాతీయ విద్యా విధానంలో వృత్తి విద్యపై ప్రాధాన్యత వంటి ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాలు ఈ గణాంకాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. కళాశాలలు కేవలం డిగ్రీల కోసమే కాకుండా, ఉద్యోగాల కోసం బోధించాలి. యాజమాన్యాలు సిలబస్ రూపకల్పనలో సహకరించాలి, పరీక్షా బోర్డుల్లో పాల్గొనాలి. విద్యార్థులు డిగ్రీ పూర్తయిన తర్వాత కాకుండా, డిగ్రీలో భాగంగానే క్షేత్రస్థాయి పారిశ్రామిక అనుభవాన్ని పొందాలి. ప్రతి మధ్యతరగతి భారతీయుడూ జీతం మాత్రమే కోరుకోవడం లేదు -చాలామంది సొంతంగా ఏదైనా నిర్మించాలని కోరుకుంటున్నారు, ఉద్యమ్ ద్వారా సరళీకృత ఎంఎస్ఎంఈ నమోదు, సీజీటీఎంఎస్ఈ ద్వారా రుణ హామీలు, ట్రెడ్స్ ద్వారా ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ వంటి పథకాలు ఇప్పటికే దీన్ని సులభతరం చేస్తున్నాయి. చిన్న సంస్థలకు అధికారిక బ్యాంకు రుణాల వాటా 2020లో 14 శాతం నుంచి 2024కి 20 శాతానికి పెరగడం సానుకూల సంకేతం. భారత నగరంలో ఎక్కడో, ఆ తండ్రి ఇప్పటికీ సకాలంలో తన రిటర్న్ దాఖలు చేస్తూనే ఉన్నారు, ఆ తల్లి తన కూతురి రుణాన్ని తీరుస్తూనే ఉన్నారు. ఇద్దరూ ప్రభుత్వం నుంచి ఎలాంటి దానాన్నీ కోరలేదు, ఇప్పుడు క్రమంగా వారికి అలాంటి అవసరం కూడా తగ్గుతోంది. మధ్యతరగతికి అర్థమైనది, గత దశాబ్దపు సంస్కరణలు అందించాలని ప్రయత్నిస్తున్నది దానం కాదు, అవకాశం మాత్రమే. శిక్షణకు తగిన ఉద్యోగం, రిస్క్ తీసుకోదగిన వ్యాపారం, ప్రజాధనం ఇప్పటికే వాగ్దానం చేసిన దానికి రెట్టింపు పన్ను వేయని నగరం. ఇప్పుడు ప్రశ్న మధ్యతరగతి 'వికసిత్ భారత్' భారాన్ని మోయగలదా? అని కాదు -ఎందుకంటే ముప్పై ఏళ్లుగా నిశ్శబ్దంగా భారాన్ని మోస్తూనే ఉంది. ఇవాళ ఎప్పటికంటే ఎక్కువగా ప్రభుత్వ విధానాలు ఆ బాధ్యతను పంచుకోవడానికి సహకరిస్తున్నాయి అని. మధ్యతరగతి ఇక దానం కోరదు, అవకాశాన్నే కోరుతుంది. -ఆ అవకాశమే వికసిత్ భారత్‌కు నిజమైన పునాది. ■




ఎదుటివారు చేసిన తప్పు కంటే, దాని చుట్టూ మనం అల్లుకునే ఊహలే ఎక్కువ బాధ కలిగిస్తాయి. జరిగిన సంఘటనకు, మనసు సృష్టించే కథనానికి మధ్య తేడాను గుర్తించడం నేర్చుకోండి. వాస్తవాన్ని యథాతథంగా చూసినప్పుడే స్పష్టత లభిస్తుంది, అనవసర ఆందోళన తగ్గుతుంది. తక్షణ ప్రతిస్పందన కంటే, కాస్త సమయం తీసుకుని ఆలోచించడమే వివేకవంతమైన నిర్ణయానికి దారి తీస్తుంది. మనసును ప్రశాంతంగా ఉంచుకోగలిగినప్పుడే, ఏ పరిస్థితినైనా సరైన కోణంలో అర్థం చేసుకోగలుగుతాం.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## 1400 ఏళ్ల నాటి బలి రహస్యం?



పెరూ రాజధాని లిమాలోని పురాతన హువాకా పుక్లానా పిరమిడ్ వద్ద పురావస్తు శాస్త్రవేత్తలు సంచలన కథనాన్ని వెలుగులోకి తెచ్చారు. ఒక వయోజన పురుషుడి అస్థిపంజరాన్ని తవ్వకాల్లో గుర్తించగా, ఆచార బలిగా అతడిని సమర్పించి ఉంటారని భావిస్తున్నారు. క్రీ.శ. 650 నాటిదిగా ప్రాథమికంగా అంచనా వేసిన ఈ అవశేషాలు, దాదాపు 1,400 ఏళ్ల నాటివి. సెరిమోనియల్ పూల్‌కు అనుసంధానమైన కాలువను మూసివేసే తంతులో భాగంగా ఈ బలి జరిగి ఉంటుందని పరిశోధకుల అభిప్రాయం. అస్థిపంజరం కాలువ లోపల ఎడమవైపు వాలి, పుర్రె పిరమిడ్, పసిఫిక్ మహాసముద్రం వైపు చూస్తున్నట్టు ఖననం చేయబడింది. తవ్వకాల నేతృత్వం వహించిన పురావస్తు శాస్త్రవేత్త గ్లాడిస్ పాజ్ ప్రకారం, ఈ ఎముకలు లిమా సంస్కృతి ఆచారాలను అర్థం చేసుకోవడానికి, వందల ఏళ్ల క్రితం నిర్వహించిన వేడుకలను పునర్నిర్మించడానికి ఉపయోగపడతాయి. చిన్న మట్టి ఇటుకలతో నిర్మించిన ఇతర నిర్మాణాలకు భిన్నంగా, నదీ రాళ్లతో నిర్మించిన ఈ ఆచార బావి నిర్మాణ శైలే ఈ ఆవిష్కరణలో అత్యంత ప్రత్యేకమైనదిగా పెరూ సంస్కృతి మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇంకా ఇక్కడ ఒక సెరామిక్ పాము తలను కూడా గుర్తించారు.

# ఆకు కాదిది ఔషధ గని

వాము ఆకులు యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీబయాటిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యానికి అమృతంగా పనిచేస్తాయి. జలుబు, గొంతులో గరగరతో బాధపడుతున్నవారికి వామ కులతో రసం చేసుకుని తాగితే కఫం అంతా క్లియర్ అవుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు వాము ఆకులను నమలడం వల్ల, ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను దూరంగా ఉంచడంలో మీకు సహాయపడుతుంది. వాము ఆకులను నీటిలో మరిగించి తాగడం వల్ల శ్వాసకోశ సమస్యలు దూరంగా ఉంటాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. ఈ ఆకు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వాము ఆకులు మరిగించిన నీటిలో ఇంగువ, నల్ల ఉప్పు కలిపి తీసుకుంటే, అది కడుపు నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. ఇవి అనాల్జేసిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి పంటి నొప్పి, తలనొప్పి, శరీర నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆకులను మెత్తగా చేసి, ప్రభావిత ప్రాంతానికి లేపంగా అప్లై చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వాము ఆకులతో చట్నీ కూడా తయారు చేసుకోవచ్చు. చట్నీ చేయడానికి, ఆకులను వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొద్దిగా నిమ్మరసంతో కలిపి తయారు చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా వామాకుల రసం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక తీవ్రమైన వ్యాధుల్ని నివారిస్తుంది. రోజూ రెండు ఆకులు నమలడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరుగుతుంది. వాము ఆకుల రసం తీసుకోవడం ఆర్థరైటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇది కీళ్ల నొప్పులు, వాపుల్ని తగ్గించడంలో సాయపడుతుంది. ఇది బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాము ఆకుల



రసం తాగడం వల్ల కళ్లకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కళ్లు, కంటి చూపును నిర్వహించడానికి అవసరం. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. వాము ఆకు కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. వాము ఆకులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రోటీన్స్ తదితర ఖనిజాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను దూరం చేస్తుంది. వాము ఆకు తింటే జీవక్రియ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆకు తింటే అధిక రక్తపోటు సైతం నియంత్రణలోకి వస్తుంది.

# ఇష్టమని ఈ మాంసం తెగ లాగించేస్తున్నారా?



చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ మీట్ ఎక్కువగా తింటారు. చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ మీట్ ఎక్కువగా తింటారు. కానీ దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల గురించి పట్టించుకోరు. నిజానికి ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం. వారానికి 1 లేదా 2 సార్లు రెడ్ మీట్ తినవచ్చు. ఒకేసారి 80 నుంచి 100 గ్రాముల వండిన రెడ్ మీట్ తినడం ఆరోగ్య కరం. ఇలా వారానికి మొత్తం 300 నుంచి 350 గ్రాములకు మించకూడదు. ఎందుకంటే ఎక్కువ రెడ్ మీట్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల రెడ్ మీట్ మితంగా తినడం, తక్కువ కొవ్వు ఉన్న ముక్కలను ఎంచుకోవడం, తక్కువ నూనెలో ఉడకబెట్టడం ఆరోగ్యకరం. నిపుణుల ఆహార మార్గదర్శకాల ప్రకారం నెయ్యి, వెన్న, పూర్తి కొవ్వు పాలు వంటి సంతృప్త కొవ్వులతో ఎంత ప్రమాదమో రెడ్ మీట్‌తోనూ అంతే ప్రమాదమని చెబుతున్నారు. కొవ్వు కాలేయ రోగులు రెడ్ మీట్ తినవచ్చు, కానీ పరిమిత పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. రెడ్ మీట్‌లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. కాబట్టి, దానిని ఎక్కువగా తినడం వల్ల కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో కొవ్వు కాలేయ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అందువల్ల మీరు వారానికి ఒకసారి వైద్యుడి సలహా మేరకు దీనిని తీసుకోవచ్చు. ఆహారంలో రెడ్ మీట్ తీసుకోవడం తప్పనిసరి కాదు. శరీరానికి అవసరమైన ప్రోటీన్, ఇనుము, విటమిన్లు, ఇతర పోషకాలను పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, చేపలు, సోయాబీన్స్, వేరుశెనగ వంటి ఆహారాల ద్వారా కూడా అందుతుంది.

# అల్లరి చేస్తున్నారనీ పిల్లలకు ఫోన్ ఇస్తున్నారా?



పిల్లలు అన్నం తినడం లేదనో.. అల్లరి చేస్తున్నారనో.. వారి చేతికి స్మార్ట్‌ఫోన్ ఇస్తున్నారా? అయితే మీరు స్క్రీన్ బ్రైబ్ ట్రాప్‌లో పడిపోయినట్టే. దీనివల్ల మీ పిల్లలు ఏం కోల్పోతున్నారో తెలిస్తే షాక్ అవుతారు! దీనినే నిపుణులు స్క్రీన్ బ్రైబ్ లేదా డిజిటల్ లంచం అని పిలుస్తున్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలను ఆడించడం తల్లిదండ్రులకు పెద్ద టాస్క్‌గా మారిపోయింది. ఆఫీస్ పని ఒత్తిడిలోనో లేక కాసేపు ప్రశాంతంగా ఉండాలనో చాలామంది పేరెంట్స్ చేస్తున్న పని.. పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్ ఇవ్వడం. దీనినే నిపుణులు స్క్రీన్ బ్రైబ్ లేదా డిజిటల్ లంచం అని పిలుస్తున్నారు. అయితే ఈ చిన్న అలవాటు మీ పిల్లల ఎదుగుదలను నిలువునా దహించి వేస్తోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. పిల్లలు మారాం చేసినప్పుడు లేదా వారు ఏడుస్తున్నప్పుడు వారిని శాంతింపజేయడానికి ఫోన్ ఇవ్వడాన్ని స్క్రీన్ బ్రైబ్ అంటారు. ఇది తాత్కాలికంగా ఉపశమనం కలిగించినా, దీర్ఘకాలంలో పిల్లలను మానసిక రోగులుగా మార్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ అలవాటు వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి అత్యంత విలువైన 4 విషయాలను దొంగిలిస్తున్నట్లే లెక్క. పిల్లలు ఇతరులతో మాట్లాడితేనే భాష వస్తుంది. కానీ ఫోన్‌కు అలవాటు పడిన పిల్లలు కేవలం వినడానికే పరిమితం అవుతున్నారు. దీంతో వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ దెబ్బతింటున్నాయి. నేటి కాలంలో చాలామంది పిల్లల్లో స్పీచ్ డిలే అంటే మాటలు ఆలస్యంగా రావడానికి ప్రధాన కారణం ఇదే. చుట్టుపక్కల మనుషులతో ఎలా ఉండాలి? ఎవరైనా వస్తే ఎలా పలకరించాలి? వంటి ప్రాథమిక విషయాలను పిల్లలు కోల్పోతున్నారు. స్క్రీన్ ప్రపంచంలో మునిగిపోవడం వల్ల వారు ఒంటరితనాన్ని అలవాటు చేసుకుంటున్నారు. ఇది భవిష్యత్తులో వారిని విపరీతమైన మొండితనం ఉన్నవారిగా మార్చే అవకాశం ఉంది. పిల్లలకు బోర్ కొట్టినప్పుడు వారు సొంతంగా ఏదైనా నేర్చుకోవాలి. కానీ ఆ ఖాళీని ఫోన్‌తో నింపడం వల్ల వారికి ఓర్పు నశిస్తోంది. ఫోన్ లాక్కున్న వెంటనే విపరీతమైన కోపం తెచ్చుకోవడం, వస్తువులను విసిరేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తమ భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకోవాలో వారు నేర్చుకోలేకపోతున్నారు. ఖాళీ సమయంలో పిల్లలు మట్టిలో ఆడటం, బొమ్మలు గీయడం వంటివి చేయాలి. కానీ నిరంతరం వీడియోలు చూడటం వల్ల వారి మెదడు ఆలోచించడం మానేస్తుంది. కేవలం స్క్రీన్‌పై వచ్చే రంగులు, శబ్దాలకు మాత్రమే వారు స్పందిస్తారు. దీనివల్ల వారిలో క్రియేటివిటీ పూర్తిగా నశించిపోతుంది. పిల్లలను ఆడించడానికి ఫోన్‌ను ఒక సాధనంగా వాడకండి. పిల్లలకు బోర్ కొడితేనే వారు కొత్త ఆటలను కనిపెడతారు. వారి ఆలోచనలకు పదును పెట్టనివ్వండి. రోజులో కనీసం గంట సేపు ఫోన్లు పక్కన పెట్టి పిల్లలతో గడపండి. వారితో కలిసి చిన్న చిన్న ఇంటి పనులు చేయండి. మీ బిడ్డ చేతిలో ఉన్న ఫోన్ కేవలం ఒక గ్యాడ్జెట్ మాత్రమే కాదు.. అది వారి మేధస్సును హరించే ఆయుధం అని గుర్తుంచుకోండి. ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

## పిల్లలు త్వరగా మెచ్యూర్ అవుతున్నారా?

ఇటీవల కాలంలో ఆడపిల్లలు చిన్న వయసులోనే మెచ్యూర్ అవుతున్న సంఘటనలు తల్లిదండ్రుల్లో పెద్ద ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో సాధారణంగా 12?14 ఏళ్ల తర్వాతే అమ్మాయిలు మెచ్యూర్ అవుతారు. కానీ ఇప్పుడు జీవనశైలి మార్పులు, ఆహార అలవాట్లు వలన కొన్నిసార్లు చిన్న వయసులోనే ప్యూబర్టీ (రజస్వలత్వం) కనిపిస్తోంది. ఇటీవల కాలంలో ఆడపిల్లలు చిన్న వయస్సులోనే మెచ్యూర్ అవడం కొందరు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇంతకుముందు 12 నుంచి 14 ఏళ్ల తర్వాతే అమ్మాయిలు మెచ్యూర్ అయ్యేవారు. కానీ, ఇప్పుడు మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయస్సులోనే రజస్వల(ఖబీఎవతీబిఎ) అవుతున్నారు. అయితే, ఇందుకు కారణం చికెన్, గుడ్లు, ప్యాకెట్ పాలు లాంటి పదార్థాలేనని కొంతమంది భావిస్తున్నారు. కానీ, ఇతర కారణాలు కూడా అయి ఉండవచ్చు. మరి చిన్న వయస్సులోనే ఆడ పిల్లలు మెచ్యూర్ కావడానికి ఇవే కారణమా? లేక వేరే ఏమైనా కారణాలు ఉన్నాయా? వైద్య నిపుణులు చెబుతున్న కారణాలు ఏమిటి? చికెన్ తినడం వల్ల మెచ్యూర్ త్వరగా వస్తుందన్నది చాలా మంది చెప్పే విషయం. కానీ, పరిశోధనలు మాత్రం చికెన్ వల్ల మెచ్యూర్ త్వరగా వస్తుందని స్పష్టమైన ఆధారం లేదు. అసలు ఈ విషయానికి సంబంధించిన పెద్ద స్థాయిలో పరిశోధనలు కూడా లేదు. చికెన్‌లో హార్మోన్లు ఉంటాయని కొందరు అంటారు, కానీ ఆ హార్మోన్లు మన శరీరానికి ప్రభావం చూపే స్థాయిలో ఉండవు అని వైద్యులు చెప్తున్నారు. పాలు ఆరోగ్యానికి మంచిదనే విషయం అందరికీ తెలుసు. అయితే పాలు తాగితే మెచ్యూర్ ముందుకు వస్తుందా? అంటే.. ఇక్కడ కూడా శాస్త్రంగా నిర్ధారించబడిన స్పష్టమైన సంబంధం లేదు. పాలు తాగడం వల్ల శరీర బరువు పెరిగితే.. అది మెచ్యూర్ కారణమవ్వొచ్చు. కానీ పాలే కారణమని చెప్పడం సరికాదు. గుడ్లు ఆరోగ్యకరమైన ప్రోటీన్ అందిస్తాయి. మెచ్యూర్ త్వరగా వచ్చే కారణంగా గుడ్లు ప్రస్తావించడం సరైనది కాదు. గుడ్లు ఎక్కువగా తినడం వల్లే మెచ్యూర్ అవుతారని చెప్పడం కూడా సరైనది కాదు. మెచ్యూర్ (మొదటి రక్తస్రావం) త్వరగా వస్తే దానికి కారణాలు చాలా ఉంటాయి. బరువు ఎక్కువగా ఉన్న పిల్లల్లో హార్మోన్ స్థాయిలు మారి మెచ్యూర్ ముందుకు రావడం సాధారణం. ఫాస్ట్ ఫుడ్, తీపి పానీయాలు, ప్రాసెస్ చేసిన స్నాక్స్ ఎక్కువగా తింటే శరీర బరువు పెరుగుతారు. అంతేకాక, ఇవి హార్మోన్లపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటి ద్వారా కూడా తొందరగా మెచ్యూర్ అయ్యే అవకాశం ఉంది. ప్లాస్టిక్ బాటిల్స్, కెమికల్స్, పెస్టిసైడ్స్ వంటి వాటిలో ఉండే రసాయనాలు హార్మోన్ వ్యవస్థను ప్రభావితం చేసి మెచ్యూర్ ముందుకు తీసుకురావచ్చు. సమతుల ఆహారం.. పండ్లు, కూరగాయలు, మాంసం, బియ్యం, పప్పు తీసుకోవడం. వైయామం/ఆట.. రోజుకు కనీసం 30 నిమిషాలు. జంక్ ఫుడ్ తగ్గించండి. పర్యావరణం గురించి జాగ్రత్త.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి. సమయానికి ఆరోగ్య పరీక్షలు.. 8 సంవత్సరానికి ముందే మెచ్యూర్ లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ని సంప్రదించండి. చివరగా.. చికెన్, పాలు, గుడ్లు తింటే అమ్మాయిలలో మెచ్యూర్ ముందుకు వస్తుందని శాస్త్రంగా నిర్ధారించలేదు. మెచ్యూర్ త్వరగా వచ్చే కారణం ఆహారం కాదు, పూర్తి జీవనశైలి, బరువు, జన్యు, పర్యావరణం వంటి అంశాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి.

## రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారా?



నేటి జీవనశైలిలో చాలామంది సరైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పని ఒత్తిడి, మొబైల్ వినియోగం, టీవీ, సోషల్ మీడియా వంటి అలవాట్ల కారణంగా రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం సాధారణమైపోయింది. అయితే, ఈ అలవాటు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి చాలా ఆరోగ్యకరమైన విషయాలకు దూరమవుతున్నాడు. అందులో ప్రధానమైనది నిద్ర. మారుతున్న జీవనశైలి, ఉద్యోగ సమయాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఉద్యోగాలు చేస్తున్నవారు రాత్రి వేళల్లోనూ పనిచేయడం, ఇంట్లో ఉంటే ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి సమయానికి నిద్రపోవడం లేదు. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా మేల్కోవడం అనేవి రెండూ కూడా మనిషి ఆరోగ్యానికి హానికరమైనవేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయంలో 7 గంటల కంటే తక్కువగా నిద్రపోయే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. అందుకే రాత్రి సమయంలో తప్పనిసరిగా 7 గంటలపాటు నిద్రకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. నిద్ర తక్కువైతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి? నిద్ర అనేది శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. శరీర కణాలు పునరుద్ధరించబడతాయి. మెదడు జ్ఞాపకశక్తిని బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యం అవుతాయి. అందుకే పెద్దవారికి రోజుకు కనీసం 7?8 గంటల నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రభావం.. తక్కువ నిద్ర వల్ల ఒత్తిడి (ాబితీవబబ) పెరుగుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు రావచ్చు. చిరాకు, కోపం ఎక్కువవుతాయి. గుండె సంబంధిత సమస్యలు.. నిద్ర లోపం దీర్ఘకాలంగా ఉంటే.. అధిక రక్తపోటు, గుండెపోటు ప్రమాదం, స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. షుగర్, బరువు పెరగడం.. తక్కువ నిద్ర వల్ల ఇన్సులిన్ పనితీరు తగ్గుతుంది. ఆకలి పెంచే హార్మోన్లు ఎక్కువవుతాయి. ఊబకాయం (ాఎవబతిబిఎ), టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం.. నిద్ర సరిపోకపోతే శరీరం వైరస్‌లు, ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని కోల్పోతుంది. దీంతో తరచూ జలుబు, జ్వరం, అలసట లాంటివి వస్తుంటాయి. జ్ఞాపకశక్తి, పనితీరు తగ్గడం.. తక్కువ నిద్ర ఏకాగ్రతను తగ్గిస్తుంది. జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. పని లేదా చదువులో పని తీరు పడిపోతుంది.

## చెరకుగడ లాభాలు..

చెరకుగడను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకుగడ.. చక్కెర, బెల్లంకు ముడి సరకు అయిన దీనిని మనం చాలా తక్కువగా తీసుకుంటాం. మార్కెట్లు, బజార్లలో వీటిని ఎక్కువగా అమ్ముతుంటారు. కానీ, మనం ఎక్కువగా వీటిని పట్టించుకోం. కొన్నిసార్లు చెరకు రసం జ్యూస్ రూపంలో తీసుకుంటాం. కానీ, చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకు రసం తాగితే లాభం ఉంటుందని చాలా మందికి తెలిసినప్పటికీ.. చెరకుగడ తినడం ఆరోగ్యానికి ఇంకా మంచి ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చెరకు గడలో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వల్ల పేగులు సక్రియంగా పనిచేస్తాయి. జీర్ణం మెరుగవుతుంది. అజీర్ణం తగ్గుతుంది. గ్యాస్ సమస్య తగ్గుతుంది. చెరకు గడను తినడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ఎందుకంటే.. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గడానికి ఇది సహాయపడుతుంది. ఇది "నేచురల్ డైట్ ఫైబర్" లా పని చేస్తుంది. చెరకు గడలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఆహారంలో ఉండే షుగర్ శరీరంలో వేగంగా జీర్ణం అవుతుంది. దీంతో రక్తంలో గ్లూకోస్ స్థాయి స్టేబుల్ అవుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి కూడా మితంగా మంచిది. కానీ, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే తినాలి. ఇది కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. చెరకు గడలో ఉండే పోషకాలు శరీరాన్ని డీటాక్స్ చేస్తాయి. అందువల్ల కాలేయం క్లీనింగ్ అవుతుంది. విషకణాలు బయటకు బయటకు పోతాయి. శరీరం శు భ్రంగా ఉంటుంది. శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుతుంది. చెరకు గడ తినడం వల్ల శరీరంలో నీటి సమతుల్యత నిల్వ ఉంటుంది. దీని వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది. చర్మం మృదువుగా ఉంటుంది. వేడిలో శరీరం తేమగా ఉంటుంది. చెరకు గడలో ఉండే ఫైబర్, విటమిన్స్, ఖనిజాలు హృదయానికి కూడా ఉపయోగపడతాయి. కాలేయంలో కొవ్వు తగ్గించడంలో సహాయం చేస్తుంది. కోలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయం చేస్తుంది. దీంతో హృదయ ఆరోగ్యం మెరుగవుతుంది. చెరకు గడలో ఉండే తీపి పదార్థం శరీరానికి శక్తి ఇస్తుంది. ఇది అలసట తగ్గిస్తుంది. పని చేయడానికి ఎనర్జీ ఇస్తుంది. రోజువారీ శక్తి అవసరాన్ని తీర్చుతుంది.

## బెడ్ మీద కూర్చొని తింటున్నారా..?

మీకు మంచం మీద కూర్చుని టీవీ చూస్తూ భోజనం చేసే అలవాటు ఉందా..? అయితే మీరు తెలియకుండానే పెద్ద ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారు. చూడటానికి ఇది చాలా సౌకర్యంగా అనిపించినా.. మీ జీర్ణవ్యవస్థను, నిద్రను, చివరికి మీ చర్మాన్ని కూడా ఇది దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి రాత్రిపూట లేదా ఖాళీ సమయాల్లో మంచం మీద కూర్చుని, టీవీ చూస్తూనో లేదా మొబైల్ వాడుతూనో భోజనం చేయడం అలవాటు. ఇది ఎంతో హాయిగా, సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ ఈ చిన్న అలవాటు మీ ఆరోగ్యానికి ఎంతటి చేటు చేస్తుందో తెలుసా..? మంచం మీద తినడం వల్ల కలిగే అనర్థాలపై ఆరోగ్య నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. మనం ఆహారం తిన్నప్పుడు మన శరీరం నిటారుగా ఉండాలి. అప్పుడే ఆహారం అన్నవాహిక ద్వారా కడుపులోకి సులభంగా వెళుతుంది. మంచం మీద కూర్చున్నప్పుడు మనం నిటారుగా ఉండము, దీనివల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావు. పడుకుని తినడం వల్ల ఆహారం అన్నవాహికలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. ఇది తీవ్రమైన ఎసిడిటీ, గ్యాస్, గుండెల్లో మంటకు దారితీస్తుంది. మంచం మీద తింటున్నప్పుడు మన దృష్టి ఆహారం మీద కంటే టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌పైనే ఎక్కువగా ఉంటుంది. దీనిని మైండ్‌లెస్ ఈటింగ్ అంటారు. అంటే మనం ఎంత తింటున్నామో మన మెదడుకు సరిగ్గా తెలియదు. దీనివల్ల అవసరానికి మించి ఎక్కువగా తినేస్తాం. ఫలితంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. మంచం మీద తిన్నప్పుడు మనకు తెలియకుండానే చిన్న చిన్న ఆహార కణాలు పరుపులు, దుప్పట్లపై పడతాయి. ఇవి కంటికి కనిపించవు కానీ, బ్యాక్టీరియా, ఇతర కీటకాలను ఆకర్షిస్తాయి.

# భారత్ నా రెండో ఇల్లు: ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్

- భారత్‌ను తన రెండో ఇల్లుగా అభివర్ణించిన షేన్ వాట్సన్
- ఆస్ట్రేలియా కంటే ఇండియాలోనే ఎక్కువ ప్రేమ, మద్దతు పొందానన్న షేన్ వాట్సన్
- సిడ్నీలో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వ్యాఖ్యలు
- ఐపీఎల్ తన కెరీర్‌కు కీలక సమయంలో అద్భుతమైన వేదికనిచ్చిందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ భారత్‌ను తన రెండో ఇల్లుగా అభివర్ణించాడు. సొంత దేశం ఆస్ట్రేలియా కంటే భారత్‌లోనే తనకు అత్యధిక ప్రేమాభిమానాలు, మద్దతు లభించాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సిడ్నీలోని భారత కాన్సులేట్ నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా వాట్సన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. భారత్‌లో క్రికెట్‌ను ఆరాధించే వారు సంఖ్య ఆస్ట్రేలియా కంటే ఎంతో అధికమని షేన్ వాట్సన్ పేర్కొన్నాడు. "భారత్‌లో నన్ను ఎవరూ పెద్దగా విమర్శించలేదని భావిస్తున్నాను. అక్కడ నాకు ఎప్పుడూ లభించే మద్దతు మరువలేనిది. ఆస్ట్రేలియాలో రాణించినప్పుడు ప్రశంసలు దక్కేవి, కానీ విఫలమైనప్పుడు విమర్శలు తప్పేవి కావు" అని వివరించాడు. భారత్‌తో పాటు ఇక్కడి ప్రజలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని, తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌పై భారత్ చెరగని ముద్ర వేసిందని కొనియాడాడు.

తాను 19 ఏళ్ల ప్రాయంలో తొలిసారి భారత్‌ను సందర్శించానని, అప్పటి నుంచి ఈ దేశం సాధిస్తున్న అద్భుత ప్రగతిని నిశితంగా గమనిస్తున్నానని వాట్సన్ గుర్తు చేసుకున్నాడు. తనకు భారతీయ శాఖాహార వంటకాలంటే ఎంతో మక్కువని కూడా వెల్లడించాడు.

2008లో ప్రారంభమైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), తన కెరీర్ కీలక దశలో ఉన్నప్పుడు ఒక అద్భుతమైన వేదికను కల్పించిందని కృతజ్ఞత చాటుకున్నాడు. కాగా, వాట్సన్ ఐపీఎల్‌లో 2008 నుంచి 2020 వరకు రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే.

# 12 ఏళ్ల ఎదురుచూపులకు బ్రేక్: శ్రీలంకతో రెండో టెస్టులో సారంశ్ జైన్ అరంగేట్రం!





**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 165 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ (డబ్ల్యూటీసీ 2027) ఫైనల్ రేసులోకి దూసుకొచ్చింది. యంగ్ స్పిన్నర్ మానవ్ సుతార్ తన రెండో టెస్టులోనే 10/131 మైండ్ బ్లాకింగ్ ఫిగర్స్‌తో రచ్చ చేయగా, టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రం ఈ మ్యాచ్ తీవ్ర నిరాశనే మిగిల్చింది. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 25 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసిన కుల్‌దీప్, ఓవర్‌కు 4.64 రన్ రేట్‌తో ధారాళంగా పరుగెచ్చి కేవలం ఒక్క వికెట్ మాత్రమే దక్కించుకున్నాడు. స్పిన్ ట్రాక్‌పై కుల్‌దీప్ ఈ స్థాయిలో తడబడటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. కుల్‌దీప్ యాదవ్ పర్ఫార్మెన్స్‌పై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇండియన్ టీమ్‌లో మిగతా స్పిన్నర్లతో పోలిస్తే కుల్‌దీప్ చాలా తక్కువ ఓవర్లు వేశాడు, పైగా భారీగా పరుగులు ఇచ్చాడు. రెగ్యులర్ ఛాన్సెస్ రావట్లేదనే సానుభూతి ఉన్నప్పటికీ, వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిన బాధ్యత అతనిపైనే ఉంది. ఈ ప్రదర్శన కుల్‌దీప్‌కు ఖచ్చితంగా ఒక వేకప్ కాల్.. ఇలాగే జరుగుతుంటే మేనేజ్‌మెంట్ ఎక్కువ కాలం సర్దుకుపోలేదంటూ కుల్‌దీప్ భవిష్యత్తు డైలామాలో పడిందన్నాడు.

**కుల్‌దీప్ ప్లేస్‌లో సారాంశ జైన్‌కు డెబ్యూ ఆఫర్?:**

రెండో టెస్టులో కుల్‌దీప్ స్థానంలో యంగ్ ఆఫ్‌స్పిన్నర్ సారాంశ జైన్‌ను బరిలోకి దించవచ్చని ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం మన జట్టులో జడేజా, మానవ్ సుతార్ రూపంలో ఇద్దరు క్వాలిటీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు ఉన్నారు. వీళ్లిద్దరూ వికెట్లు తీస్తూనే బ్యాటింగ్‌లోనూ మంచి కాంట్రిబ్యూషన్ ఇస్తున్నారు. ఇక లంక టీమ్‌లో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఎక్కువగా ఉన్నందున, వెరైటీ కోసం ఒక ప్రాపర్ ఆఫ్ స్పిన్నర్‌ని టీమ్‌లోకి తెస్తే బాగుంటుందని చోప్రా చెప్పుకొచ్చాడు.

**రెండో టెస్టులో భారత్ ప్లేయింగ్ XI ఎలా ఉండబోతోంది? :**

శ్రీలంకతో జరగబోయే రెండో టెస్టులో టీమిండియా మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. కొలంబో వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో కుల్‌దీప్‌కు మరో అవకాశం ఇస్తారా లేక కొత్త వ్యూహాలతో సారాంశ జైన్‌ను మైదానంలోకి దించుతారా అనేది సస్పెన్స్‌గా మారింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ప్రతి మ్యాచ్ కీలకమైనందున, శుభ్‌మన్ గిల్ సేన ఎలాంటి తుది జట్టుతో బరిలోకి దిగుతుందో లేదో చూడాలి మరీ.

# క్రికెట్ ప్రసారాల్లో కొత్త విప్లవం.. ఫిఫా టెక్నాలజీతో ఇండియా-ఆఫ్ఘన్ సిరీస్!






**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరగబోయే టీ20 సిరీస్, క్రికెట్ ప్రసారాల చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఈ సిరీస్‌ను, ఇటీవలి ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ తరహాలో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రసారం చేసేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సిరీస్ ప్రసార హక్కులను దక్కించుకున్న ఐటీడబ్ల్యూ యూనివర్స్ సంస్థ, మునుపెన్నడూ లేని విధంగా వీక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది.

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. ఈ సిరీస్ ప్రసారాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత స్టెబిలైజ్డ్ కెమెరాలు, వాల్యూమెట్రిక్ ఫ్రీ-వ్యూపాయింట్ టెక్నాలజీ, అత్యాధునిక స్పైడర్‌క్యామ్, అల్ట్రా-మోషన్, సినిమాటిక్ స్టోరీ టెల్లింగ్ వంటి ఫీచర్లను తొలిసారిగా ఒక ద్వైపాక్షిక సిరీస్‌లో ప్రవేశపెట్టనున్నారు. వీటికి అదనంగా క్విడిచ్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ రూపొందించిన 'స్పాటియో' సిస్టమ్‌ను కూడా ఉపయోగించనున్నారు. ఈ టెక్నాలజీ సాయంతో డ్రోన్ ఫీడ్‌పై ఆగ్మెంటెడ్ రియాలిటీ గ్రాఫిక్స్‌ను జోడించి, ఆటగాళ్ల కదలికలను రియల్ టైంలో ట్రాక్ చేయవచ్చు. దీని ద్వారా ఫీల్డ్ ప్లేస్‌మెంట్, వ్యూహాలను చాలా వినూత్నంగా చూపించే అవకాశం ఉంటుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు జేమీ ఓక్‌ఫోర్డ్ దర్శకత్వం వహించనున్నారు. ఆయన 2002 నుంచి ప్రతి ఫిఫా ప్రపంచకప్‌లో పనిచేయడమే కాకుండా 2014 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్‌కు కూడా డైరెక్టర్‌గా వ్యవహరించారు. "ఒక ద్వైపాక్షిక సిరీస్‌ను పూర్తిస్థాయి ఫిఫా ప్రపంచకప్ ప్రసార ప్రమాణాలతో నిర్మించడం ఇదే తొలిసారి. ప్రపంచకప్ ఫైనల్స్‌కు పనిచేసిన నిపుణులే ఈ సిరీస్‌కు పనిచేస్తారు" అని ఐటీడబ్ల్యూ యూనివర్స్ ఒక ప్రకటనలో పేర్కొంది.

"ప్రేక్షకులకు మైదానంలో అత్యుత్తమ సీటులో కూర్చున్న అనుభూతిని అందించడమే మా లక్ష్యం" అని సంస్థ వ్యవస్థాపకుడు భైరవ్ శాంత్ స్పష్టం చేశారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మూడు మ్యాచ్‌ల ఈ టీ20 సిరీస్ సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నింటికీ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదిక కానుంది. కాగా, ఈ సిరీస్‌కు ఆఫ్ఘనిస్థాన్ జట్టు అధికారిక ఆతిథ్య జట్టుగా వ్యవహరిస్తుండటం విశేషం.

# అట్లీ అనుభవించిన ఒకే చిత్రం!



నిక్కీ తంబోలి ఆకర్షణీయమైన గ్లామరస్ లుక్



యాషిక ఆనంద్ షీర్ బ్లాక్ గౌన్‌లో స్టన్ చేసింది



ప్రఖ్యాత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన విజువల్ వండర్ -ది ఒడిస్సీ- సినిమాపై కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సినిమాను తాను థియేటర్‌లో అనుభవించిన తీరు గురించి చెబుతూ సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘమైన భావోద్వేగ నోట్‌ను పంచుకున్నారు. సాధారణంగా మనం సినిమాలను చూస్తామని.. కొన్నింటిని మెచ్చుకుంటామని...కానీ కొన్ని సినిమాలు మాత్రం మనల్ని పూర్తిగా వేరే లోకానికి తీసుకువెళ్తాయని అట్లీ పేర్కొన్నారు. -ది ఒడిస్సీ- తనకు అలాంటి అద్భుతమైన అనుభూతినే అందించిందన్నారు. ఈ చిత్రంలో నోలన్ నరేషన్ విధానం ఎంతో ఆశ్చర్యకరంగా ఉందని అట్లీ అభిప్రాయపడ్డారు. సినిమాలో ప్రతీ విజువల్ ప్రత్యేకమైన భాషను కలిగి ఉంటుందని.. కెమెరా దృశ్యాలను చూపడమే కాకుండా కథలో మరో పాత్రలా ప్రయాణిస్తుందని తెలిపారు. అలాగే లూడ్విగ్ అందించిన సంగీతం సినిమా నేపథ్యానికి మాత్రమే పరిమితం కాలేదు. చూసేవారి రక్తంలోకి ఇంకిపోతుందంటూ సంగీత దర్శకుడి ప్రతిభను ఆకాశానికెత్తారు. థియేట్రికల్ అనుభవం గురించి మాట్లాడుతూ.. తాను థియేటర్‌లో ఎప్పుడూ అనుభవించని అడ్రినలైన్ రష్ ..ఇమ్మర్సివ్ ఫోర్స్‌ను ఈ సినిమా ద్వారా అనుభవించానన్నారు. ప్రేక్షకులు తమను తాము పూర్తిగా సినిమాకు అంకితం చేసుకునేలా చేసేదే అసలైన ఎపిక్ సినిమా అని -ది ఒడిస్సీ- సరిగ్గా అదే కోవకు చెందుతుందని అట్లీ అభివర్ణించారు. ఈ సినిమాను చూడటమే కాదు.. దానిని ఒక అనుభవంగా జీవించవచ్చని తెలిపారు. ఇంకా సినిమా చూడని ప్రేక్షకులకు అట్లీ ఓ సలహా కూడా ఇచ్చారు. ఈ విజువల్ వండర్‌ను కచ్చితంగా ఐమ్యాక్స్ స్క్రీన్లపైనే అనుభవించాలని కోరారు. సినిమా మనల్ని చుట్టుముట్టేలా? మనల్ని పూర్తిగా తనలోకి లాక్కునేలా ఐమ్యాక్స్ అనుభూతి ఉంటుందన్నారు. -కొన్ని సినిమాలు కేవలం చూడటానికి మాత్రమే ఉంటాయి. మరికొన్ని సినిమాలు అనుభవించడానికి మాత్రమే పుడతాయి- అంటూ అట్లీ పోస్టును ముగించారు.

దీంతో -ది ఒడిస్సి-కి మరింత హైప్ క్రియేట్ అవుతుంది. నచ్చిన విదేశీ చిత్రాలను ప్రోత్సహించడంలో టాలీవుడ్...కోలీవుడ్ డైరెక్టర్లు ఎప్పుడూ ముందుంటారు. కంటెంట్..మేకింగ్ నచ్చిందంటే? ఆ చిత్రాన్ని నిర్మొహమాటంగా ఆకాశానికి ఎత్తేస్తారు. ఇలాంటి సినిమాల విషయంలో దర్శక దిగ్గజం రాజమౌళి కూడా అంతే ఉత్సాంహం గా మాట్లాడుతుంటారు. ప్రస్తుతం ఈ ఇద్దరు దిగ్గజ దర్శకులు పాన్ వరల్డ్ మార్కెట్ ను టార్గెట్ చేసిన సంగతి తెలిసిందే. వారణాసిని రాజమౌళి 120 దేశాల్లో రిలీజ్ చేస్తుంటే? ఆ సినిమా ఫలితం చూసి రాకాను అంతకు మించి భారీ ఎత్తున రిలీజ్ చేయాలని అట్లీ ప్లాన్ చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965